

అది మానవ చరిత్రలో రెండో అపూర్వ సంఘటన. అంతకు పూర్వం రెండు మాసాలక్రితం మానవులు తొలిసారిగా అంతరిక్షనౌకలో చంద్రుణ్ని చుట్టి వచ్చారు. ఎన్నో రికార్డింగులూ, ఫొటోలూ, స్పెక్టోగ్రాఫులూ మొదలైనవి తెచ్చారు.

స్పూత్నిక్‌ల యుగం ముగిసిపోయింది. అయిదుదేశాలవాళ్ళు పంపిన స్పూత్నిక్కులు ఆకాశంలో సంచరిస్తున్నాయి. అవి అంతర్జాతీయ దృశ్య రేడియో ప్రసారాలనూ, నిత్య ప్రసంగాలనూ విరివిగా ప్రసారం చేస్తున్నాయి. ఎన్నో పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలుపెట్టి, ఎక్కువ స్పూత్నిక్కులను గుర్తించినవారికి బహుమానాలుకూడా ఇచ్చారు.



# కొండవీటిగాంతటి కలయుంబరాలు

దేశాలమధ్య అంతరిక్ష యానాలలో ఎవరు ముందుపోతారన్న దాన్నిగురించి నానాదేశాల శాస్త్రవేత్తలు రకరకాల అభిప్రాయాలు ప్రకటిస్తున్నారు. ఏ దేశపు మానవుడు మొట్టమొదటగా శుక్రగ్రహంమీద—లేక అంగారకగ్రహంమీద—ముందు అడుగు పెడతాడు ?

ఈ పోటీలో పాల్గొంటున్న దేశాలలో ఎస్పెరాంటో దేశంకూడా ఒకటి. ఆ దేశంనుంచి దాదాపు పన్నెండు టన్నుల బరువుగల అంతరిక్షనౌక అంగారక గ్రహంకేసి బయలుదేరిందన్నవార్త ప్రపంచం మూలమూలలా ప్రతిధ్వనించింది. ఇది సాహసోపేతమైన ప్రయత్నమనీ, ఎస్పెరాంటో శాస్త్రజ్ఞులు తొందరపడ్డారనీ కొద్దిమంది అంతరిక్షయాన ప్రవీణులు తమ శంకలను వెలిబుచ్చారు. ప్రపంచం

లోని ఆరు రేడియో టెలిస్కోపులు అంతరిక్ష నౌకయొక్క గమనాన్ని గమనిస్తున్నాయి. వాటి పరిశీలనల ఫలితాలను పత్రికలు ప్రకటిస్తున్నాయి. "అబ్సెర్వేటోయ్రొ దెలస్పాతొస్" (ఎస్పెరాంటో దేశానికి జగద్విఖ్యాతమైన అబ్జర్వేటరీ) వారు, అంతరిక్షనౌక తూచా తప్పకుండా నిర్దిష్టమార్గాన నడుస్తున్నదనీ, అందులో బయలుదేరిన ఇద్దరుయువకులూ—లేర్తొ, కురాజొ అనేవారు—నిశ్చింతగా, సంపూర్ణారోగ్యోత్సాహాలు కలిగి ఉన్నారనీ, తమ పరిశీలనలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారనీ ప్రకటించింది. అంతరిక్షనౌక భూమియొక్క ఆకర్షణపరిమితిని అతిక్రమించే సమయంలో దృశ్యరేడియోలో కనిపించిన ఆ యువకుల ముఖాల ఫొటోలు అనేక వేల పత్రికలు ప్రకటించినై.

ఈ యువకులను మనం అనుసరించబోతున్నాంగనక వారినిగురించి మనం కొద్దిగా తెలుసుకోవాలి. లేర్తొ చాల మేధావి. అతను పన్నెండో ఏటనే అంతరిక్షయాన సమస్యలనుగురించి ఒక థీసిస్ రాశాడు. దాన్ని కొమ్ములుతిరిగిన శాస్త్రవేత్తలుకూడా మెచ్చుకున్నారు. ఆ మరుసటి సంవత్సరంనుంచే అతను అంతరిక్షయాత్రికులు పొందదగిన ప్రత్యేకశిక్షణ పొందాడు. ఈ శిక్షణ కాలంలో అతను అత్యున్నతమైన ప్రశంసలు పొందాడు. కాని అతనికి అంతరిక్షయాన మంటే ఏ మూలనో కొంత జంకు ఉండేది. ఈ సంగతి ఎవరూ కనిపెట్టలేదు—ఒక్క కురాజొ తప్ప.

కురాజొ లేర్తొకన్న ఒక ఏడాది పెద్దవాడు. అతను వ్యాయామక్రీడలలో ఆరితేరినవాడు. అందగాడుకూడా. ఎంతోమంది అమ్మాయిలు అతనికి ప్రేమలేఖలు రాశారు. వారిలో సగంమంది అతన్ని పెళ్లాడటానికి సిద్ధపడ్డారు. వారిలో కొందరు వివాహితలుకూడా ఉన్నారు; అతను పెళ్ళాడతానంటే వాళ్లు తమ భర్తలకు విడాకులిస్తామన్నారు. ఒకరిద్దరు తమభర్తలను నిపుణంగా హత్య చేస్తామనికూడా మాట ఇచ్చారు.

కాని కురాజొ దృష్టి, మనస్సూ చుక్కలవేపున్నై. గ్రహాంతరాలకు వెళ్ళిపోవటానికి అతని ఆత్మ తహతహ లాడుతున్నది. అతను తండ్రితో పోట్లాడి ఆస్ట్రొనాటిక్స్ శాస్త్రం ప్రత్యేకంగా చదువుకున్నాడు. అదేంకర్మోగాని అతనికి ఏనాడూ టెస్టుల్లో ఉన్నతశ్రేణి రాలేదు. అతను తెచ్చుకున్న పెద్దశ్రేణి "బీమైనస్". ఒకసారి "సీమైనస్"కూడా వచ్చింది.

"ప్రపంచంలోకెల్లా నేనే మొదటి ఆస్ట్రొనాట్‌ను కావాలంటావు. ఫిజికల్ ట్రెయినింగులో ఎంతో రాణిస్తున్నావు. తియరీలో ఇంత తక్కువ మార్కులు తెచ్చుకుంటావేమిటి ?" అని కురాజోను అతని ప్రొఫెసరు ఎన్నోసార్లు అడిగాడు. కురాజొ తల నేలవేసి ఏమీ చెప్పలేకపోయేవాడు. ఆగ్రహంతో అతని మొహం జేవురించేది. ఆ ఆగ్రహం మరెవరిపైనా కాదు—తనపైనే।

ఈ దశలో లేర్తోకూ, కురాజోకూ పరిచయమయింది. నిమిషాలమీద ఆ పరిచయం స్నేహంగా మారిపోయింది. ఈ స్నేహం వారిద్దరి జీవితాలకూ ఒక కొత్త పునాదిరాయి అయింది. ఆ పునాదిరాయిపైన వారి భవిష్యత్తు దృఢంగా పాదుకున్నది.

మనం స్నేహం గురించి ఎన్నో కథలు చదువుతాం. అవి చాలావరకు కరుణామయంగా ఉంటాయి. ఒకరి కోసం ఒకరు మహత్తరత్యాగాలు చేస్తారు. ప్రాణాలే అర్పించటానికి సిద్ధపడతారు. మన హృదయాలు వారిపట్ల సానుభూతితో నిండిపోతాయి. కాని ఆ స్నేహం వారి భౌతిక జీవితాలను ఏవిధంగా తీర్చి దిద్దినదీ మనకు తెలీదు. ప్రేమ కథలు కూడా అంతే—ప్రేయసీ ప్రియుల ప్రేమించుకోవటమూ, వారి హృదయ వీణలనూ అద్భుతంగా శ్రుతికలపటమూ మనకు తెలుస్తుందే తప్ప. ఆ ప్రేమ వారి జీవితాలలోనూ ఎలాటి వాంఛనీయ పరిణామాలు తెచ్చినదీ మనకు తెలీదు.

లేర్తో, కురాజో స్నేహం అలాటిదికాదు. వారు ఈ స్నేహంతో సమగ్ర వ్యక్తులైనారు. లేర్తో హృదయ కుహరంలో కనపడీ కనపడ కుండా ఉండిన పిరికితనమనే క్రిమిని. కురాజో తన ధైర్యసాహసాలతో నిర్మూలించేశాడు. లోకాంతరాలకు వెళ్లాలనే ఉత్సాహం కురాజో నుంచి లేర్తోను అంటువ్యాధి లాగా సంక్రమించింది. అంతరిక్షయాన శాస్త్రమర్మాలు పుస్తకాలలో చదివినా, ప్రొఫెసర్లు ఒకటికి నాలుగుసార్లు రంగరించి ఇచ్చినా తలకెక్కనివి. లేర్తో ఒక్కసారి వివరించగానే కురాజోకు అర్థమైపోయినై. అతను ఆఖరు టెస్టులో "ఏమైనస్" తెచ్చుకున్నాడు. ప్రొఫెసరు ఆశ్చర్యానికి అంతులేదు. "ఈ జ్ఞానం ఇన్నాళ్లూ ఎక్కడ దాచి పెట్టావు?" అన్నాడాయన.

ఈసారి కురాజొ మొహం సంతోషంతో జేవురించింది. అతను చాతనయినంత గాలి పీల్చుకుని రొమ్ము పెద్దది చేసుకుని నవ్వుతూ నిలబడ్డాడు.

"నీపేరు రెండో లిస్టులో చేర్చమని సిఫార్సు చేస్తాను. మొదటి లిస్టులో ముగ్గురే ఉన్నారు. ఇంకొక పేరు చేర్చవచ్చుగాని, నీపేరు సూచించడానికి నాకింకా ధైర్యం చాలటంలేదు", అన్నాడు ప్రొఫెసరు.

ఆయన చేయ్యలేని పనిని లేర్తా చేయించాడు, అతను పట్టుబట్టి కురాజో పేరు మొదటి లిస్టులో, అందులోనూ తన పేరుతో జోడించి, వేయించాడు.


తన పేరు లిస్టులో పడినది మొదలు కురాజొ ప్రతి రాత్రీ గ్రహాంతరాలను గురించి విడవకుండా కలలు కన్నాడు. అవి విడ్డూరమైన కలలు. ఏ ఒక్క గ్రహానికీ గురుత్వాకర్షణ శక్తి ఉండేదికాదు, తనకు బరువూ ఉండేదికాదు. బరువు లేని స్థితి ఏమిటో అతనికి శిక్షణ ద్వారా బాగానే తెలుసు. కాని కలలో ఉండే బరువు లేని స్థితి వాస్తవం కన్న చాలా సౌకర్యవంతంగా ఉండేది. వాస్తవమైన బరువు లేని స్థితిలో మనిషి కండరాలు కొన్ని ఎక్కువ శ్రమించాలి, మరి కొన్ని తక్కువ శ్రమిస్తాయి. కాని కలలో అసలు ఏ కండరానికీ పనిలేదు – అన్ని కదలికలూ మనసు యొక్క నిర్దేశాన్ని బట్టే జరిగిపోయేవి.

## 2

అంతరిక్ష నౌకలో అంతా సరిగానే ఉన్నది. లేర్తా యంత్రాలను గమనిస్తూ, రీడింగులు తీసుకుంటున్నాడు – ఈ పని ఇద్దరిలో ఎవరో ఒక్కరు చెయ్యాలి. కురాజొ టెలిస్కోపులో నుంచి ఆకాశాన్ని పరిశీలిస్తున్నాడు. టెలిస్కోపు కిందికి వంచినా నక్షత్రాలు కనిపించటంలో గల వింత అతని కింకా విచిత్రంగానే ఉన్నది.

"ఈ నూక్లియర్ జెట్....రాకెట్ వేగవృద్ధి నింపాదిగా జరగటానికి ఎంత సహాయం!...బాటరీలు అయిపోవటం ఉండదు....కెమికల్ జెట్ ఎంత క్రూడ్!."

కురాజొ తల త్రిప్పి లేర్తా కేసి చూశాడు. లేర్తా తనతో మాట్లాడడంలేదు. ఈ ప్రయాణం ఆరంభమైనది మొదలు లేర్తా తన మనసులో ఆలోచనలు పైకి అనటం అలవాటు చేసుకున్నాడు – కొందరు నిద్రలో మాట్లాడినట్టు. ఇట్లా ఏడెనిమిది సార్లు జరిగినా కురాజొ ఇంకా దీనికి అలవాటు పడలేదు. "ఈ దిక్కుమాలిన అలవాటు మానెయ్యి, లేర్తా!" అందామని అతనికి నోటి దాకా వచ్చింది గాని, అనటానికి అంతరాత్మ ఒప్పలేదు. "నేనేం దురలవాట్లు ప్రదర్శిస్తున్నాను!..



"సాంఘిక చిత్రంకోసం కథ రాయమంటే రాశాను. తీరా నిర్మాణదశ కొచ్చేసరికి ఫక్తు అదే కథ. మాటలు పాటలుతో సహా జానపద చిత్రం అయి కూర్చుంది!"

"అదో లెఖ్ఖ! ఒక మహాకవి జీవితం రాయమంటే రాశా! చిత్రం తయారైయ్యాక అది సాంఘిక, పౌరాణిక, చారిత్రక, జానపద, మిస్టరీ, క్రైమ్ వీటిల్లో దేనికి చెందుతుందో మహామహావాళ్ళే తికమక పడుతున్నారంటే నమ్ము!"

---

అంతరిక్ష యానాలలో మన తత్వంలో కలిగే మార్పులను ఇంకా పరిశోధించ వలసి ఉన్నది!" అనుకున్నాడు కురాజో.

అతను మళ్లీ టెలిస్కోపు వేసి కళ్లు త్రిప్పి ఆశ్చర్యంతో ఒక్క క్షణం పాటు బిగుసుకు పోయి తరవాత, "లేర్తొ, లేర్తొ! ఒక్కసారి ఇలా వచ్చిచూడు!" అన్నాడు.

లేర్తొ అతిప్రయత్నంమీద లేచి నిలబడి చేతికి అందినదల్లా పట్టుకుని పాదరసంలో ఈదుతున్నవాడల్లే వచ్చి టెలిస్కోప్‌లోనుంచి చూసి, "అదేమిటో నాకు తెలియటంలేదు, కురాజో! ఏదన్నా అస్టరాయిడ్ అయిఉంటుందా? అది టెలిస్కోపులో ఎటూ కదలకుండా ఉన్నది చూశావా? మన దారిలోనే ఉన్నది. మనం దానికేసి వెళుతున్నామో, లేక అదే మనకేసి వస్తున్నదో తెలియటంలేదు. ఒక్క క్షణం ఉండు, కురాజో. అది ఎంత దూరంలో ఉందో, ఎంత ప్రమాణం గలదో, మనం ఏవేగంతో దాన్ని సమీపిస్తున్నామో ఇప్పుడే చెబుతాను." అన్నాడు.

అతను అంత శ్రమపడి తన స్థానానికి తిరిగివెళ్ళి, "కురాజో, అది మనకు యాభై వేల కిలోమీటర్ల దూరాన ఉంది....దాని వ్యాసం సుమారు నూట ఎనభై, రెండు వందల కిలోమీటర్లుండవచ్చు....మనం దాన్ని సెకండుకు అర కిలోమీటరు వేగంతో సమీపిస్తున్నాం. అది ప్రస్తుతం మనం వెళ్ళే దిక్కుగానే వెళుతున్నది. కాని మనం దానికన్న సెకండుకు అర కిలోమీటరు హెచ్చు వేగంతో పోతున్నాం." అని ఒక్కొక్క వివరమే తెలియబరిచాడు.

కురాజో కాబిన్ అంతా కలయజూశాడు. ఒక పక్కగా ఉన్న మొక్కలు ఎండపడి అందంగా ప్రకాశిస్తున్నై. బయటికి చూస్తే నల్లటి ఆకాశంలో వెలిగించిన దీపాల్లాగా నక్షత్రాలు నిలిచి ప్రకాశిస్తున్నై. అంతరిక్ష నౌక కదిలిపోతున్నట్టు సాక్ష్యం ఏమీలేదు. భూమిమీద ఉన్న మనకు భూమియొక్క భ్రమణంగాని, చలనం గాని కొంచెంకూడా తెలియనట్టే, అంతరిక్ష యాత్రికులకు తమ కదలిక తమకు తెలియదు. బయటి దృశ్యాలలో ఏదన్నా మార్పుంటే ఆ మార్పుకు కారణమైన కదలిక బయటి వస్తువులదే అయినట్టుంటుంది. ఈ సంగతి కురాజోకు తెలియకపోలేదు. అయినా అతనికి తాము కదులుతున్నామన్నది జ్ఞాపకం రాగానే ఆశ్చర్యం కలగనే కలిగింది.

"లేర్తో, నాకు నిద్ర వచ్చేస్తున్నది. అవసరమైతే లేపు." అంటూ అతను కళ్ళు మూసుకున్నాడు.

లేర్తో తన గడియారంకేసి చూసుకున్నాడు. అతనికి నిద్ర రావటంలేదు గాని మనసు కొంచెం మందగించి ఉన్నది. తాను పైకి మాట్లాడుతున్న సంగతి తెలియకుండానే అతను, "యాభై వేల కిలోమీటర్లు... సెకండుకు అర కిలోమీటరు చొప్పున నూరువేల సెకండ్లు....దాదాపు ముప్పై గంటలు...ఆరు గంటల కొకసారి ఆ ఆస్టరాయిడ్‌ను గమనిస్తూంటే చాలు!" అన్నాడు.

అతని మత్తు కొంచెంగా తగ్గింది. ఈ ఆస్టరాయిడ్ – అది ఆస్టరాయిడ్ అయితే – సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉండిఉండాలి. తమ ఆర్బిట్‌కూ దాని ఆర్బిట్‌కూ చాలా తేడా ఉంటుంది. ముప్పై గంటల్లో అది మరింతదూరం పోయి ఉంటుంది. అది కనిపించే దిక్కుకూడా మారిపోతుంది. దానికి తాము సాధ్యమైనంత దగ్గిరలో ఉండగా పరిశీలించడం మంచిది. గంట కొకసారి చూస్తే సరిపోతుందా? కనీసం రెండు గంటల కొకసారి. వీలైతే ఫొటోలు కూడా తీయవచ్చు....

కొంచెంసేపు పోయాక అతను ఆహారం తీసుకున్నాడు. తరవాత అతను భూమిని "కాంటాక్ట్" చేసి అస్టరాయిడ్ సంగతి చెప్పాడు. అవకాశం ఉంటే దానిని గమనించటానికీ, ఫొటోలు తీయటానికీ అనుమతి పొందాడు; కాని దానిపై దిగటానికి మటుకు అతనికి అనుమతి రాలేదు.

గంట దాటినాక లేర్తా మరొకసారి అస్టరాయిడ్ వివరాలు తీసుకున్నాడు. అది ఇప్పుడు నలభై వేల కిలోమీటర్ల దూరం మాత్రమే ఉన్నది. ఇంకో నాలుగు గంటల్లో అది చాలా దగ్గిరికి రావచ్చు. లేదా వీలయినంత దగ్గిరికి వచ్చి మళ్ళీ దూరం కావటం జరగవచ్చు. టెలిస్కోపులోనుంచి చూస్తేగాని దాని మార్గానికీ, తమ మార్గానికీ ఇప్పు డెన్ని డిగ్రీల వ్యత్యాసం ఉన్నదీ తెలియదు. కొంత వ్యత్యాసం ఉన్నమాట మాత్రం నిజం.

లేర్తా లేచివెళ్ళి టెలిస్కోపును చేరటానికి బద్ధకించాడు. కురాజో సుఖ నిద్రలో ఉన్నాడు. అతను లేవగానే తాను కాస్సేపు నిద్ర పోవాలని ఉన్నది. కురాజో రెండు గంటలపాటు నిద్ర పోగలడు. లేర్తా గంటకు మించి నిద్ర పోలేడు. భూమిమీదకూడా లేర్తా రోజుకు నాలుగైదు గంటలు మించి నిద్ర పోయే వాడు కాదు. ఈ అంతరిక్ష నౌకలో రోజుల లెక్క పోయింది. నాలుగు గంటలు మేలుకుని ఉండేసరికల్లా నిద్ర వచ్చేస్తుంది. గాఢనిద్ర అయితే రెండు గంటలు; తేలికనిద్రఅయితే త్వరలోనే మెళుకువ రావచ్చు. ఎన్నోసార్లు లేర్తా నిద్రపోయిన పదిహేను, ఇరవై నిమిషాలకల్లా లేవటం జరిగింది.

ఈసారి కురాజో గంటన్నరలోనే లేచాడు. అతను కళ్లు తెరవగానే లేర్తా తాను భూమితో మాట్లాడినట్లు చెప్పి "అస్టరాయిడ్‌ను గమనించటానికి అనుమతి ఇచ్చారు. దానిమీద దిగవద్దన్నారు. దిగి చేసేదేమీ ఉండదు. దానిపైన గాలిగాని, ప్రాణులు గాని, ఉండే అవకాశం కొంచెంకూడా లేదు. అది శిథిలమై పోయిన గ్రహం తాలూకు పెళ్ల మాత్రమే!" అన్నాడు.

లేర్తా కళ్లు మూసుకుంటూండగానే కురాజో టెలిస్కోప్ దగ్గిర చేరాడు. గ్రహశకలాన్ని పరీక్షించాడు. అది సొట్టలుపడిన కోడిగుడ్డులాగా ఉంది. ఎండ పడుతున్న వేపున సొట్టలు నల్లగా లేక కొద్దిగా నీలంగా ఉన్నట్టు అతనికి తోచింది. వాతావరణం లేకపోతే నీలం రంగు ఎట్లా వస్తుంది.

అతను పరికరాలను సమీపించి తాము ఆ గ్రహశకలంకేసి లేర్తా చెప్పిన దాని కన్న హెచ్చువేగంతో పోతున్నట్లు తెలుసుకున్నాడు. అది అంతరిక్ష

నౌకను ఆకర్షించటంవల్ల తమ వేగం హెచ్చిఉంటుందా ? దాన్ని తాను మొదటిసారి గమనించి ఇంత సేపయినప్పటికీ అది ఇంకా సూటిగా తమ దారిలోనే ఉన్నది.

కురాజో తన పూచీపైన చెయ్యగూడని పనిచేశాడు — లేర్తొ మేలుకొని ఉంటే ఆ పని చెయ్యనిచ్చి ఉండడు! — అతను రాకెట్ ఇంజనును స్టార్ట్ చేశాడు. లేర్తొ ఉలిక్కిపడిలేచి ఏమి జరిగిందీ తెలుసుకునేలోపల అంతరిక్షనౌక వేగం సెకండుకు మరొక కిలోమీటరు పెరిగింది.

"ఆ చప్పు డేమిటి, కురాజో ?

"ఏమీలేదు. రాకెట్‌ను కొద్దిగా బూస్ట్ చేశాను."

"దేనికీ ?"

"ఆ గ్రహశకలం సంగతి తేల్చుకోవటానికి."

"అనుమతి సంపాదించావా ?"

"లేదు. అనవసరం."

కురాజోనుంచి తనలోకి విద్యుచ్ఛక్తి ప్రవహించినట్టుగా లేర్తొ శరీరం పులకరించింది. కాని పైకి అతను ఆగ్రహమే ప్రదర్శించాడు.

"నీలోఉన్న జబ్బేఇది—నీకుండే మొండిధైర్యాన్ని ఇలా దుర్వినియోగపరుస్తావు" అన్నాడతను.

"ఇప్పుడు కొంప మునిగిపోయిం దేమిటంటాను. గ్రహశకలాన్ని పరిశీలించటానికి మనకు అనుమతి ఉండనే ఉందిగద. దానిచుట్టూ వీలయితే రెండు మూడుసార్లు తిరిగి ఫొటోలు తీసుకుందాం. అందువల్ల జాప్యం కాకుండా మన వేగం కాస్త పెంచాను. దానికి రాద్ధాంతం చేస్తావేమిటి ?"

గ్రహశకలం అయిదువందల కిలోమీటర్ల దూరంలోకి వచ్చినాక వాళ్ల టెలిస్కోపును ఒక్కక్షణం వదలలేదు. ఈ లోపుగానే లేర్తొ భూమికి దానితాలూకు వివరాలు అందజేశాడు. ఈ అల్పగ్రహానికి అయస్కాంతక్షేత్రం లేదు. ఇందులో వాతావరణం ఉన్నది. ఇది ప్రమాణంలో చిన్నదేఅయినా, సైజుకు మించిన బరువు గలది. (దాని ఆకర్షణశక్తిని తమ వేగవృద్ధి సహాయంతో లేర్తొ గుణించాడు.) అన్నిటికన్న ముఖ్యం ఇందులో ప్రాణులున్నై. అడవులూ, కొండలూ, సముద్రాలూ ఉన్నట్టు స్పష్టమవుతున్నది.

అవసరమైతే గ్రహశకలంపై దిగటానికి భూమినుంచి అనుమతి వచ్చింది కాని ఏ పరిస్థితిలోనూ అంతరిక్ష యాత్రికులు తమ ఆకాశదుస్తులను విసర్జించరాదు.



ఏడుకొండల సార్ :

మధురాది రసములన్ మరగి చొక్కుచు జిహ్వ
నీ వర్ణనములకున్ నిగుడనీదు ...............

— పోతన (భాగవతము)

---

## 3

ఒక విశాలమైన మైదానంలో ఒకస్త్రీ, పురుషుడూ విశ్రాంతిగా ఒక చెట్టు క్రింద కూచుని ఉన్నారు. ఆడమనిషి ఆయాసంతో రొప్పుతున్నది. ఆమె ఒక మోపు గడ్డికోసింది, ఇన్ని దుంపలు తవ్వింది. ఆమె పని చేస్తున్నంత సేపూ మగవాడు చెట్టుకింద వెల్లకిలా పడుకుని గాలి మేస్తున్నాడు. ఆడమనిషి తన కాళ్లదగ్గిర వచ్చి కూచోంగానే, వాడు ఆమెకేసి కాళ్లు చాచాడు. ఆమె వాడికాళ్ళు ఒత్తనారంభించింది.

"హుఁ !" అని మగవాడు చిరాకుగా కాలు జాడించి ఆడమనిషిని తన్నాడు.

"ఏంటి, మాపై గోరు ?" అని అడిగింది ఆడది.

"సేతుల కాతడి యేంది ?"

"సెవఁట మాపై గోరు !"

"సెవఁట సేత్తో తాకుతావంటే లవఁడీ? బట్టకు చెయ్యి తుడుచుకో బనిలా?"

"బట్టంతా సెఁవటకి ముద్దయి పోయింది, మావైగోరు."

"ఏంజేస్తాం? అట్టాగే సావుమరి." అన్నాడు మగవాడు, తన భార్య కాళ్లు వత్తటం మానటం చూసి.

ఆడమనిషి మళ్లీ మగవాడి కాళ్లు ఒత్తుతూ, చల్లగాలికి మోరఎత్తి ఆకాశంలోకి పరధ్యానంగా చూసి, చకితురాలై, అదేంటి, మావైగారు?" అన్నది.

కళ్లు మూసుకుని సుఖం అనుభవిస్తున్న మగవాడు." ఛీ, నీ జలమజెడా, నాకు కాసింత శావజెయమనే తలికి నీ బుద్ధి సెదిరి పోద్దెంతుకనీ? అదేంటీ, ఇదేంటీ.... ఏంటిదీ?" అని వెష్టపడ్డాడు.

ఆడది మళ్లీ మొగుడి కాళ్లు పిసకా నారంభించింది. అయినా ఆమె దృష్టి ఆకాశంలో కనిపించిన ఆ ధగధగలాడే వస్తువు మీదే ఉంది. అదేమిహై వుంటుంది దేవతావిమానమా? ఎందుక్కాకూడదూ?

"నీ సేతులకు ముళ్లు తగిలించుకున్నావెట్టా?" అంటూ మగవాడు గునిశాడు.

"సేతులు కాయలు గాయలామరీ?" అన్నది ఆడది మనసు ఎక్కడో పెట్టుకుని.

మగవాడు కళ్ళుతెరచి, భార్య ఆకాశంకేసి చూస్తూండటం గాంచి, "ఏంటే, యెదపమొగఁ వేసుకుని అట్ట జూస్తావూ? ఏంటుందాడ, నీబొంద, అన్నాడు.

"దేవతా యిమానం, మావైగోరూ! సందేహంలేదు," అన్నది ఆడది.

మగవాడు ఆమె చూస్తున్న వేపేచూసి తుళ్ళిపడ్డాడు. ఒకచిన్న గుట్టంతవస్తువు దభాల్న నేలపైన పడింది. భూమిఅంతా కంపించి పోయింది.

"ఇదేందేవ్? సుమారుగా మన పట్నమంత ఉండదల్లే ఉందే! నువ్వన్నట్టు దేవతలుగాని దిగలేదుగందా," అన్నాడు మగవాడు లేచి కూచుంటూ.

మరుక్షణం ఆ విమానంలోంచి ఆకాశంఎత్తు ఆకారం బయటికొచ్చింది. అది రాకాసికి మల్లే ఉంది దానివెనకే ఇంకో ఆకారంకూడా దిగింది. అది మొదటి రాకాసికి అన్నో, తమ్ముడో అన్నట్టుంది.

ఆడది కెవ్వున అరచింది. మగవాడు "అమ్మో, రాచ్చసులు!" అని అరిచి కాలిసత్తువకొద్దీ ఒకగంతేసి పరిగెత్తాడు. ఆడదిమాత్రం కూచున్నది కూచున్నట్టే కొయ్యబారి పోయింది.

తాము ఈ లోకంలో అడుగు పెడుతూనే కనీసం ఇక్కడి రెండు ప్రాణులలో ఇంత అలజడి తెచ్చినసంగతి లేర్తోకుగాని, కురాజోకుగాని ఏమాత్రమూ తెలియదు. ఈ గోళంమీద ప్రాణులున్నట్టు వారు దిగకపూర్వమే నిశ్చయించు కున్నారు. కాని ఆ ప్రాణులను వారింకా కంట చూడలేదు. అంతరిక్షనౌక నేలమీద వాలటం వారి లెక్కన ఆదర్శప్రాయంగా జరిగింది. "లాండింగ్ పర్ఫెక్ట్ !" అన్నాడు కురాజో. అంతరిక్షనౌకలోపలి వాతావరణం మనుషులకు అనుకూలించేది. బయటి వాతావరణం అనుకూలించేదనుకోవటానికి లేదు గనక వారు ఆకాశపు తొడుగులుధరించి, వాటిని సెన్ట్‌చేసుకుని, దానిజేబులలో పిస్తోళ్లు వేసుకుని డబుల్ లాక్స్ దాటి ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టారు.

వాళ్ళకు తమశరీరాలు ఈకకన్న తేలికగా ఉన్నై. "మనం సుమారు ఒక్కొక్క కిలోగ్రాం బరువుంటాం!" అన్నాడు లేర్తొ. కురాజో గాలిలోకి ఎగిరి, స్లోమోషన్ పిక్చరులో లాగా కిందికి వచ్చాడు. అతను సుమారు ఆరుగజాల ఎత్తు ఎగర గలిగాడు అదిచూసే ఆ ఆడమనిషి కొయ్యబారి పోయింది.

లేర్తొ చుట్టూ కలయ జూశాడు. అతనికి, ఇరవై గజాల దూరంలో ఆడమనిషి కూచుని ఉంది. మరి రెండు గజాల దూరంలో పారిపోతున్న మగవాడున్నాడు. కాని అతను ఇద్దరినీ చూడలేదు. ఇక్కడి మనుషులు చిన్నపిల్లవాడి జానెడుంటారని అతనికి తట్టనేలేదు. ఆడమనిషి పెట్టిన కేక అతనికి వినపడేటంత పెద్దదికాదు— ఒకవేళ అయిందే అనుకున్నా నిలువునా తొడుగుండటంచేత వినిపించే అవకాశం లేదు.

కురాజో తన తొడుగులోఉండే మైక్రోఫోనులోకి, "లేర్తో, తొడుగు విప్పేస్తే ఏమవుతుందో చూడాలని ఉంది. పీల్చటానికి పనికివస్తుందోలేదోగాని బయటఉండే గాలికి కొంత ఒత్తిడి ఉన్నమాట స్పష్టం!" అన్నాడు.

"పిచ్చివేషాలు వెయ్యకు!" అని లేర్తొ సమాధాన మిచ్చాడు.

"ఏదన్నా జరిగితే నన్ను నౌకలోకి ఈడ్చుకపోయే పూచి నీది," అంటూ కురాజొ తన తొడుగును లోపలినుంచి విప్పసాగాడు. లోపలిగాలి బుస్సుమని బయటికి వెళ్ళిపోగానే కురాజోకు తల తిరుగుతున్నట్టయి, కొంచెం తూలాడు. లేర్తొ అతనికేసి, ఒకఅడుగువేసి, కురాజొ కోలుకున్నట్టు గ్రహించాడు. అతను 'వద్దన్నపనిచేసిన పిల్లాడిలా నవ్వుతూ, నువుకూడా తొడుగు తీసెయ్యమన్నట్టు లేర్తొకు సంజ్ఞ చేశాడు.

లేర్తొ కొంచెం పస్తాయించి తలమీది డిప్పమాత్రం తీసేశాడు. అతనికికూడా తలదిరిగినట్టయింది. "ఇది మన భూమిపైన ఉండేగాలిలాటిదే—సందేహంలేదు. అయితే చాలాపలచగా ఉన్నది. గాలికి ఒత్తిడిలేదు.

"నాతో పరిగెత్తు!" అంటూ కురాజో కాలుచాచి అయిదారు బారల అంగ వేశాడు. అతనువేసిన రెండోఅంగ నేలమీద కూచునిఉన్న ఆడమనిషికి కొంచెం ఎడంగా పడింది. ఆమె గట్టిగా అరచింది.

కురాజో ఆగి కిందికి చూశాడు. తనకాలిపక్కన ఏదో ముడుచుకుని ఉండటం అతనికి కానిపించింది. అతను వంగి రెండు వేళ్ళతో ఆ ఆడదాన్నిపట్టుకుని భద్రంగా పైకెత్తాడు. ఆమె ఇంకా అరుస్తూనే ఉన్నది.


కురాజో తనకళ్ళను తానే నమ్మలేక పోయినాడు. ఎలుకసైజున ఉంటేనేంగాక, తనకుదొరికినది ఒకమనిషి—అచ్చుమనిషే! ఆడమనిషో, మగమనిషో అతను గమనించలేదు. "లేర్తొ! చూడు, చూడు!"

లేర్తొ పొందిన ఆశ్చర్యం కురాజో పొందిన ఆశ్చర్యానికి ఏమీతీసిపోదు. అతను చుట్టూచూశాడు, ఇంకా మనుషులు కనపడతారేమోనని. అప్పుడాతని కళ్లు మగవాడిమీద పడినై. అతను రెండు అంగల్లో మగవాణ్ణి అందుకుని పట్టుకున్నాడు.

ఆ స్త్రీ పురుషులను చూస్తున్నకొద్దీ లేర్తోకు ఆశ్చర్యం కలుగుతున్నది. అతనికి తాను చిన్నతనంలో చదివిన మరగుజ్జులకథలన్నీ జ్ఞాపకం వచ్చినై. గలివర్‌కథ జ్ఞాపకం వచ్చింది, అవన్నీ కల్పనలు. కాని ఇది నిజం. వాస్తవంలోకూడా ఇటువంటిది లేకపోలేదు. ప్రకృతిలో దయ్యపు బల్లులూ, మామూలు బల్లులూ కూడా ఉన్నై కావా? ఈ పేలిగాళ్ళూ, భూమిమీద మనుషులూ ఒకటేజాతి; పరిణామాలు వేరుగా ఉన్నై—అంటే ఒకజాతివాళ్ళు వేరువేరు ప్రపంచాలలో ఎట్లా చేరారు? ఆప్రశ్నకు సమాధానం ఉండేఉంటుంది. కాని దాన్ని తెలుసుకోవటానికి కొంత కాలం పడుతుంది.

"ఎవరునువు?" అని కురాజో తనకు వచ్చిన అన్నిభాషలలోనూ తనచేతిలో ఉన్న స్త్రీని అడిగాడు. కాని ఆమెకు అతని భాషరాదు, ఆమెఏదో వణుకుతూ అన్నది. అది అతనికి అర్థం కాలేదు."

మళ్ళీ లేర్తొ, కురాజొలిద్దరు మైదానంలో ఒంటరిగా మిగిలారు. ఎక్కడా వారికి ప్రాణులజాడ కనిపించలేదు. కాని వారిని అనేక వేలమంది గమనిస్తూ



"ప్లీడరుగారూ ! విల్లులో నా తదనంతరం నా యావదాస్తీ తిరిగి నాకే చెందేట్లు రాయించండి. పునర్జన్మ ఏలాగా ఉంది గా."

ఉండి ఉండవచ్చు. రెండుబెత్తల ఎత్తుండే ఆ మరుగుజ్జులను కనిపెట్టడం వారికి సాధ్యంకాదు.

తరవాత చెయ్యవలసినపని గురించి ఇద్దరికీ అభిప్రాయం కుదరలేదు. దొరికినంతమంది మనుషులను— సమ సంఖ్యలో స్త్రీ పురుషులను— బలాత్కారంగా పట్టుకుని అంతరిక్ష నౌకలో ఎక్కించుకుని, తమవెంట తీసుకపోయి, వారితో ప్రయోగాలుచేసి ఈ లోకాన్ని గురించి బోలెడన్ని విషయాలు నేర్చుకోవచ్చునన్నాడు కురాజో.

"వీళ్లు చుంచులనా. కప్పలనా నీ ఉద్దేశం? మనుషులు! మనకున్నట్టే వారికీ పవిత్రమైన జీవితంఉంది. వారు వస్తామన్నా మనం తీసుకపోవటానికి వస్తాయించాలన్నమాట. వాళ్ళ సాంఘిక వ్యవస్థ ఏమిటోకూడా మనం తెలుసుకోవాలి. నన్నడిగితే అంతకంటె ముఖ్యమైన విషయంలేదు. మానవులం అనేక లక్షల ఏళ్లగా సాంఘిక పరిణామాన్ని ఆశ్రయించి పురోగమించినవాళ్ళం. ఇతర గోళాలమీద జరిగిన సాంఘిక పరిణామాలను గురించి మనం నేర్చుకోదగిన విషయాలు ఎన్నో ఉండవచ్చు," అన్నాడు లేర్తొ.

"చూడు, లేర్తా! నాకు ఉపన్యాసాలివ్వకు. వీళ్లను తీసుకుపోతే మనం వీళ్ల భాష నేర్చుకోవచ్చు. మన భాష వీళ్లకు నేర్పవచ్చు. ఎన్నో విషయాలు తద్వారా మనం తెలుసుకోగలుగుతాం. దీని కోసం ఇక్కడ మనం వారాల తరబడి, ఉండి, వీళ్ల భాష నేర్చుకుని, వీళ్ల చరిత్ర అంతా పరిశోధించటం కాలయాపన, "అన్నాడు కురాజో.

లేర్తా నవ్వాడు. "ఏ గురుగ్రహం నుంచి అయినా అతి దీర్ఘకాయాలు వచ్చి మన లోకం నుంచి గుప్పెడు మందిని పట్టుకుపోయి వాళ్ల ద్వారా మన భాష నేర్చుకుని మన ప్రపంచంలో మానవ సమాజం గురించీ, దాని పరిణామం గురించీ తెలుసుకోగలరా? నువే కాస్త ఆలోచించు!"

"గుప్పెడు మనుషులు కూడా అక్కర్లేదు. మేధావులు ఇద్దరు ముగ్గురు దొరికితే చాలు:" అన్నాడు కురాజో.

"గురుగ్రహంలో వాళ్లను ఆ ఇద్దరు ముగ్గుర్ని పట్టుకోవటానికి ఎంతకాలం పట్టుతుందో చెప్పవేం?"

"అయితే ఏం చేద్దామని?" అన్నాడు కురాజో, ఓటమి ఒప్పుకుని.

"ఇక్కడ కొంతకాలం గడపటానికి మన వాళ్ల ఆమోదం పొందుదాం. ఆహార సమస్య ఉండదు. ఇక్కడ మనకు తగిన ఆహారం దొరక్కపోదు.

ఇద్దరూ అంతరిక్ష నౌక ప్రవేశిస్తుండగా లెర్తా కళ్లు దాని నీడపై పడ్డాయి. ఆ నీడ తాము దిగినప్పుడున్నట్టే ఉన్నదనిపించింది. ఈ గ్రహశకలం ఎప్పుడూ సూర్యుడు కేసి ఒకే ముఖం చూపుతుందా?—చంద్రుడు భూమికి చూపినట్టుగా!

ఈ విషయం తరవాత చూసుకుందామనుకున్నాడు లేర్తా.

అతను రేడియో "ఆన్" చెయ్యగానే మాటలు వినిపించినై. అది ఎస్పిరాంటో భాష కావటం చేత అతను భూమినుంచే సందేశం వస్తుందనుకున్నాడు. అయితే ఆ సందేశం మొదట్లో కొంచెం కూడా అర్థం కాలేదు.

"అతిథులకు స్వాగతం! అతిథులకు స్వాగతం! మీరు మా చీకటి ప్రాంతానికి దయ చెయ్యాలి," అన్నది రేడియో.

"ఎవరు మీరు? ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారు?" అని లేర్తా అడిగాడు.

"ఈ ప్రపంచం నుంచే మాట్లాడుతున్నాం. మీరు మీ విమానాన్ని బయలు దేరదీసి సూర్యుడు కేసి వచ్చినట్టయితే మేము మిమ్మల్ని గైడ్ చేస్తాం."

లేర్తాకు అంతా అయోమయంగా ఉంది.

"మా భాష మీకెలా తెలుసు ? మేం వచ్చామని మీకెవరు చెప్పారు ?"

"మీరు మీలోకం నుంచి బయలు దేరినది మొదలు మేము మీ ప్రయాణాన్ని గమనిస్తూనే ఉన్నాం. చాలా ఏళ్లుగా మీ రేడియో కార్యక్రమాలన్నీ వింటూ మేము మీ భాష చాలా వరకు నేర్చుకున్నాం. మీ ప్రపంచం తాలూకు విషయాలు మాకు తెలియక పోవటం చేత కొన్ని మాటలు ఏ వస్తువులనూ, ఏ భావాలనూ సూచించేదీ మాకు తెలియదు."

మీరు మాట్లాడే ఎస్పెరాంటో చాలా నిర్దుష్టంగా ఉంది. మీ లోకం నుంచే ఎవరో, మమ్మల్ని అల్లరి చెయ్యటానికి మాట్లాడుతున్నారని కూడా మాకు అనిపిస్తున్నది." అన్నాడు లేర్తొ.

"దయచేసి మా చీకటి ప్రాంతానికి రండి. చాలా విషయాలు తెలుస్తాయి."

ఈసారి వస్తాయించటం లేర్తో వంతూ, సాహసించటం కురాజో వంతూ అయింది. కురాజోకు తన మిత్రుడికి ఉన్నంత జ్ఞానం తృష్ణ లేకపోవచ్చు గాని అంత సంకోచ స్వభావం కూడా లేదు. లేర్తొ చిరకారి అయితే, కురాజో పరకు రాముడు. "మీ కోసం ఖైదు సిద్ధంగా ఉంది, రండి," అని రేడియోలో వినిపించినా అతను బయలుదేరి ఉండే వాడే.

బరువు లేని స్థితి కాకపోవటం చేత కురాజో వెళ్లి కంట్రోల్స్ దగ్గిర కూచుని రాడార్ స్క్రీను మీద వెలుగుతున్న చుక్కను గమనించి, జెట్‌స్టార్టు చేశాడు. అంతరిక్షనౌక కదిలింది. దాన్ని అతను రాడార్ సంకేతం వచ్చే దిక్కుగా నడిపాడు.

"ఇది నిజంగా ఈ ప్రపంచం వాళ్లు పంపిన సంకేతమే! వీళ్లు టెక్నాలజీలో గట్టి వాళ్లే!" అన్నాడు లేర్తొ ఆశ్చర్యంతో.

చూస్తుండగానే నౌక చీకటి ప్రాంతం ప్రవేశించింది. కురాజో నౌక దీపాలన్నీ వెలిగించాడు.

"అదుగో, ఆ ఫ్లడ్‌లైట్లు పడే ప్రాంతమే మనం దిగవలసినది," అన్నాడతను.

కురాజో సులువుగానే అంతరిక్ష నౌకను వెలుతురు ప్రాంతంలో దించాడు.

ఆ ఇద్దరూ డబుల్‌బాక్స్ తెరుచుకుని బయటికి వచ్చేసరికి నేల అంతా జనంతో కిలకిలలాడుతున్నది. వారంతా మరుగుజ్జులే. వారు కీచుగొంతులతో అరిచిన మాటలు వారికి స్పష్టంగా వినిపించలేదు. వాళ్ల నినాదాలు ఎస్పెరాంటో భాష మటుకు కాదు.

ఉన్నట్టుండి సద్దుమణిగింది. ఒక వ్యక్తి రెండు సెంటిమీటర్ల ఎత్తుగల వేదిక మీదికి ఎక్కి ఆగంతకులను సంబోధిస్తూ వారి భాషలోనే స్వాగతం చెప్పాడు.

"సిన్యోరొయ్ ఇవాళ మా ప్రపంచానికి అపూర్వమైన దినం. మా పంచాంగాలలో మీ లోకం స్వర్గమని వర్ణించబడుతోంది. మీ ప్రపంచం మా ప్రపంచానికి దగ్గరిగా వచ్చినప్పుడు మేము ఉత్సవాలు చేసుకుంటాం. నేను పొరబడితే మీరు క్షమిస్తారు గాక—మీ ప్రపంచాన్ని గురించి మాకు తెలిసినంతగా మా ప్రపంచాన్ని గురించి మీకు తెలియదని నా అనుమానం. కొంత కాలంగా మేము మీరాకకు ఎదురు చూస్తున్నాం. కాని అది మా తరంలోనే జరుగుతుందని ఆశించటానికి మేము సాహసించలేదు. ఖగోళ రీత్యా మాది అతి అల్పమైన ప్రపంచం.

"అయినా ఈ ప్రపంచాన్ని గురించి మీకు తెలియవలసిన ముఖ్య విషయాలు సంగ్రహంగా చెబుతాను. మా ప్రపంచం అని నేనంటున్నది వాస్తవానికి రెండు ప్రపంచాలు. మా చీకటి ప్రాంతానికీ, మీరు దిగిన వెలుగు ప్రాంతానికి మధ్య ఏ స్పూత్నిక్‌లూ దాటరాని అగాధం ఉన్నది. అక్కడి రాజకీయాలు వేరు, ఇక్కడి రాజకీయాలు వేరు, అక్కడి సమాజం వేరు, ఇక్కడి సమాజం వేరు, అక్కడి కళలు వేరు ఇక్కడి కళలు వేరు. ఆ ప్రపంచంలో వారికి ప్రకృతి అనుకూలించింది, మేము ప్రకృతితో పోరాడి ఎన్నో విజయాలు సాధించిన మీదట గాని మాకు కనీస జీవనం ఏర్పాటు కాలేదు.

"ఒకప్పుడు ఇక్కడి ప్రజలను ఒక పేరుతో పిలిచేవారు. అది పశువులకు ఉపయోగించే పదం. వారు మమ్మల్ని తరాలతరబడి అకివి మనుషుల స్థితిలో ఉంచారు. మా మూఢ విశ్వాసాలన్నిటినీ బలపరిచారు. మాకు జ్ఞానోదయం కలగకుండా అంధకారంలోనే ఉంచటానికి పవిత్ర గంథాలు రచించి, వాటిని చదివి, ఆడీ మాకు తల కెక్కించారు. మా భాష వేరు వారి భాష వేరు. మా భాషకు లిపి లేదు, మాకు పుస్తకాలు లేవు. కాని మా వాళ్ళు పాటలు కట్టారు, కథలు కట్టారు. అవి మా వాస్తవ సాహిత్యం. అందుచేత వాటిని మా పాలకులు నిషేధించారు. ఆ పాటలు పాడిన వాళ్లను కొలుముల్లో వేశారు. అది మాకు కనీస శిక్ష.

"అలాటి హేయమైన జీవితంనుంచి మేము స్వయంకృషితో బయటపడ్డాం. మమ్మల్ని ఎల్లప్పుడూ ఆవరించిఉండే చీకటే - మామీద వాళ్ళు వేసిన వెలే - మాకు అంగరక్ష అయింది. మొదటి దశలో మాది సమిష్టి ఉద్యమం కాదు. కొద్దిమంది మేధావులు శాస్త్రజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోగలిగారు. ఈ ప్రయత్నంలో మాకు




ఒకదొంగ సరిగ్గా దొంగతనం చేస్తున్న సమయంలోనే దొరికిపోయాడు.
"మర్యాదగా ఆ డబ్బు "అంతా" ఇక్కడ పెట్టు."
"క్షమించండి. ఈడబ్బంతా మీదికాదు. ఇందులో సగండబ్బే మీది. మిగిలింది పక్కింటివాళ్ళది."

---

ఆ ప్రపంచంవారే తొలిదశలో హెచ్చుగా సహాయపడ్డారు. మాలోపడిన విప్లవ బీజాలు మా శత్రువర్గానికి చెందిన మేధావులనుంచే వచ్చాయి. ఆ లోకంలో శాస్త్ర జ్ఞానాభివృద్ధికి ప్రతిబంధకాలు హెచ్చినకొద్దీ మా విజ్ఞానం పెరిగింది.

"వారు ఒకరకం సాంఘిక వ్యవస్థను మారకుండా చూడటానికి ముందుగా శాస్త్రాన్ని త్యాగంచేశారు. తరవాత కళలనూ, సంస్కృతినీ త్యాగంచేశారు. చిట్టచివరకు న్యాయాన్నీ. ధర్మాన్నీ, సత్యాన్నీ కొలిముల్లో ఆహుతి చేసేశారు. అది మొదలు మా సమాజం వారి సమాజాన్ని సర్వవిధాలా అధిగమించసాగింది. మాకు రెండు తరాలుగా జీవితావసరాల కొరత అన్నది లేదు: అక్కడ నూటికి అరవై మందికి సరిగా తిండిలేదు, యాభై మందికి ఉద్యోగాలు లేవు. అనేక లక్షల మందికి ఇళ్ళు లేవు. వారు చెట్ల తొర్రల్లోనూ, భూమిలోని గుంటల్లోనూ నివసిస్తున్నారు. అసలు నూటికి దాదాపు ఇరవై మంది ఏదో ఒక నేరానికి ఖైదుల్లోనే ఉంటారు. అక్కడి పరిపాలనలోని అవినీతి ఏ దశకు వచ్చిందంటే, ఆకలీ, స్వేచ్ఛా, ఆనందమూ. విజ్ఞానమూ అనే విషయాలను గురించి ఎవరన్నా రాసినా, మాట్లాడినా ఖైదులో వేస్తారు. వాటికి చీకటి విషయాలని పేరు పెట్టారు. ఆ విషయాలను తరిచేవారు మాతో సానుభూతి గలవారికింద జమ.

"ఒక్కముక్కలో మామధ్యఉండే అగాధాన్ని మీకు తెలిసేటట్టు చెబుతాను. ఆ ప్రాంతమునుంచి ఈ ప్రాంతానికి మనుషులు వలసరాకుండా ఉండటానికని రక్షక భటులను లక్షలసంఖ్యలో రిక్రూట్‌చేసి వారికింద బడ్జెట్‌లో సగం వ్యయంచేస్తు న్నారు. ప్రతిఏడూ— మాఏడాది మీ ఏడాదికన్న కాస్తహెచ్చు— వాళ్ళు మాలోకాన్ని నిర్మూలించి, మా ప్రజలందరిని నిశ్శేషంగా నిర్మూలించి, వాళ్ళను చీకటిదాస్యము నుంచి విముక్తులను చేస్తామని ప్రతిజ్ఞలు చేస్తూంటారు. ఇందుకై అంతులేని డబ్బు కేటాయించి, దాన్ని పెద్దలంతా పంచుకుంటూ ఉంటారు. ఈ ప్రహసనం ఎంతో కాలంగా సాగుతున్నది. మా ప్రాంతాన్ని జయించటం తమకు అసాధ్యమని వారికి తెలుసును. వారి సైన్యాలు వెలుగుప్రాంతాన్నిదాటి ఇక్కడికి వస్తే తిరిగి వెళ్ళవు. ఇక్కడే ఉండిపోతాయి— ఈ సంగతికూడా వాళ్ళకుతెలుసు. అయినా ప్రజలడబ్బు కాజెయ్యటానికిగాను ఏటా వాళ్ళు మమ్మల్ని మాటలతో జయిస్తూ ఉంటారు.

"ఇక్కడ మతంలేదు. జాతిభేదాలులేవు. మనుషులంతా ఒకటే. అందరికీ పనిఉన్నది, విశ్రాంతీ ఉన్నది. కొంతకాలంనుంచి మేము ఎన్నికలుకూడా మానేశాం. ఈ విషయం నేను కాస్త గర్వంగా చెప్పుకుంటే మీరు క్షమించాలి. మేము ఏటా ఎన్నికలు జరుపుతాము. మా శాసనసభలో వెయ్యిమంది ప్రజా ప్రతినిధులుంటారు. మొత్తం వెయ్యి నియోజక వర్గాలు. ఒక్కొక్క నియోజక వర్గానికి ఎందరైనా సూచించ బడవచ్చు. సాధారణంగా ఆరు, ఏడు వందల నియోజక వర్గాలకు పోటీయే ఉండేదికాదు. మిగిలినవాటికి పోటీ ఉండేది. మేము జరిపిన ఆఖరు ఎన్నిక సమయంలో పోటీదార్లే తమకున్న అర్హుడైనవాడికి అవకాశం ఇచ్చి తాము పోటీనుంచి విరమించుకున్నారు. ఆతరవాత ఎన్నికలు లేవు. ప్రజలు ఏ ప్రతినిధినైనా తీసేస్తేనూ, ఏ ప్రతినిధి అయినా ఏ కారణంచేతనైనా విరమించ దలిస్తేనూ, లేక చనిపోతేనూ ఆస్థానం ఖాళీ అవుతుంది. వెంటనే ఆస్థానానికి పోటీ లేకుండా ఎవరో ఒకరు నిర్ణయ మవుతున్నారు.

"మాకు విరుద్ధంగా కాంతిమంతులమని చెప్పుకునేవారు ఎన్నికలప్పుడు కాట్ల కుక్కలల్లే పోట్లాడుకుంటారు. ఆశయాలలోనూ, ఆదర్శాలలోనూ భేదం ఏమీ లేకుండానే రెండు పార్టీలుగా చీలి పదవులకోసం పోటీచేస్తారు. అధికారం వారి స్వార్థానికి ఎంతో లాభిస్తుందిగనక వారు పదవులకోసం కొట్లాడుకోవటంలో ఆశ్చర్యంలేదు. అదే నిజమైన ప్రజాస్వామ్యం అనటంలోనే ఆశ్చర్యం!

"మీ ప్రయాణం చూస్తే మీతో మా అల్పసమస్యలను గురించి చెప్పుకోవటం

హాస్యాస్పదమేమో అనిపిస్తుంది. చాలావిషయాలలో మేము మీకన్న ఎంతో వెనుకపడిఉన్నాం. మీకు లభ్యమైన పరమాణుశక్తి మాకింకా చిక్కలేదు. ఇక చిక్కే అవకాశంకూడాలేదు. అణుకేంద్ర విచ్ఛిత్తికి యోగ్యమయే పదార్థం మా లోకంలో లేదు. మీరు యురేనియం, ప్లూటోనియం అనే పదార్థాలు ఒకప్పుడు మా లోకంలో ఉంటే అవి ఏనాడో శిథిలమైపోయినై. అంతరిక్షయానాలుకూడా మాకు సాధ్యంకావు. మాకు విద్యుచ్ఛక్తి తెలుసు. అయస్కాంతశక్తిని మేము బహుశా మీకన్న ఎక్కువ వినియోగిస్తున్నామేమో, మాకు విమానాలున్నైగాని అవి దూరప్రయాణాలు చెయ్యలేవు".

"మీరాకకు మేమెంతో ఆనందిస్తున్నాం. ఒకప్పుడైతే మిమ్మల్ని చూడగానే మాకు మతిపోయి ఉండేది. కాని ఇప్పుడు మేము వైజ్ఞానికులపట్ల భక్తి, స్నేహమూ చూడటం అలవరుచుకున్నాం. మాకు శత్రువులెవరన్నా ఉంటే అజ్ఞానులే. మాలో ఎందరో మీతో ప్రసంగించి, తమ జ్ఞానాన్ని పెంచుకొనటానికి ఉబలాటపడుతున్నారు. మా అతిథిసత్కారాలలో లోపాలుంటే మన్నించి, వీలయినంతకాలం మాతోగడిపి మరీ వెళతారనీ, మీ ద్వారా మన ఉభయ ప్రపంచాలమధ్యా స్నేహసౌహార్దాలు పెంపొందగలవనీ ఆశిస్తున్నాను. మా అందరి తరఫునా మీకు మరొకసారి స్వాగతం చెబుతున్నాను."

ఆయన అక్కడి శాసనసభాధ్యక్షుడు, ఆయనపేరు మోజీ. ఆయన ప్రసంగం చాలామంది అర్థంచేసుకున్నట్టు గుర్తుగా మధ్యమధ్య జనంలోనుంచి హర్షధ్వానాలు వెలువడినై. ప్రసంగం అంతంలో కరతాళధ్వనులు మారుమ్రోగినై.

అధ్యక్షుడి స్వాగతానికి లేర్తా జవాబిచ్చాడు.

"ఇది మా ప్రపంచ చరిత్రలోకూడా ఒక అపూర్వసన్నివేశం. అంతరిక్షంలో గల వివిధ లోకాలలో ఎక్కడైనా యేదో జీవులుండవచ్చునని మేము అనుకున్న మాట నిజమేగాని, ఇంతచిన్న గ్రహంమీద మాకు మిత్రులు దొరుకుతారని మా శాస్త్రజ్ఞులు కలలోకూడా ఊహించలేదు. ఇంతేకాదు. మిమ్మల్ని చూసినమీదట నాకు ఇంకొక అనుమానం తట్టుతున్నది—మీరూ, మేమూ ఒకే పూర్వీకులనుంచి అవతరించి ఉండవచ్చు. మన ప్రమాణాలలో తేడాలు పరిణామఫలితమే అయి ఉండాలి. నా ఊహే నిజమైతే ఒకప్పుడు ఈ వేరువేరు లోకాలమధ్య రాకపోకలుండిఉండాలి."

"మీరు మీ జీవితాన్ని విజ్ఞానంతోటీ, స్వయంకృషివల్లా పెంపొందించు కున్నారని వినటానికి నాకెంతో ఆనందంగా ఉంది. మీ రాజకీయాలు ఎన్నికలన అధిగమించినందుకు మీ అధ్యక్షుడు ప్రకటించినగర్వాన్ని నన్నుకూడా పంచుకో నివ్వండి. మా ప్రపంచంలోకూడా అనేక బాల్యచేష్టలు ఇంకాపోలేదు. ఇదివరకు నాకు అనిపించలేదుగాని, ఇద్దరువ్యక్తులు నా కెక్కువ ప్రజాదరణ ఉన్నదంటే నా కెక్కువ ఉన్నదని పోటీపడటం బాల్యచేష్టే. ఇద్దరువ్యక్తులు తమలో ఎవరు ఎక్కువ అర్హతగలవారో ఇంకొకరు చెప్పకుండానూ, డిపాజిట్లు పోగొట్టుకో కుండానూ తేల్చుకోలేకపోతే వాళ్ళు పరిపాలనకు అర్హులే కారనాలి. వోట్లను డబ్బుతో కొనుక్కునే అధములమాట చెప్పనే చెప్పను."


"మీకు పరమాణుశక్తి లేదంటే మీరు ప్రకృతిమీద సాధించిన విజయం మరింత గొప్పదనుకుంటున్నాను. మీకన్న చాలా అనుకూలపరిస్థితులలోకూడా మా విజ్ఞానం చాలా నింపాదిగా అభివృద్ధి అయింది. బహుశా దానికి కారణం మతమూ, మూఢవిశ్వాసాలూ మమ్మల్ని అడుగడుగునా దిగలాగటం అయి ఉండొచ్చు. మీనుంచి మేమే ఎన్నో విషయాలు నేర్చుకోవలసి ఉంటుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఈ అవకాశాన్ని మేము విడిచిపుచ్చము. మేము మీకన్న చాలారెట్లు పెద్దసైజు మనుషులమే అయినా మీ మెదడు బరువుకూ శరీరాల బరువుకూ ఉండే నిష్పత్తి మాదానికన్న హెచ్చుకావచ్చు. అయినపక్షంలో మా కన్న మీరే న్యాయంగా ఎక్కువ మేధావులవుతారు. ఈ సంగతి మీ శాస్త్రవేత్తల ద్వారా వివరంగా తెలుసుకుంటాను."

"మా లోకంవారి తరఫున మీకూ, మీ జీవితవిధానానికీ శుభాకాంక్షలు అంద జేస్తూ, మన లోకాలమధ్య స్నేహసౌహార్దాల అభివృద్ధి ఆశిస్తున్నాను."

లేర్తో చేసిన ప్రసంగాన్ని అధ్యక్షుడు స్వయంగా అక్కడివారికి అర్థమయ్యే భాషలోకి అనువదించాడు. లేర్తో గొంతెత్తి మాట్లాడాడుగాని అధ్యక్షుడిలాగా మైక్రోఫోన్ ఉపయోగించలేదు—ఉపయోగించటం అతనికి సాధ్యమై ఉండదు కూడానూ.

## 5

అల్పజ్ఞులమధ్య మేధావి మసులుకోవటం ఎంతకష్టమో, క్షీణశరీరులమధ్య మసులుకోవటం లేర్తో, కురాజోలకు అంతకష్టమయింది. కూచున్నా, లేచినా, కాలుతీసి వెయ్యాలన్నా ఏ ప్రాణికీ అపాయం కలగకుండా ఎంతో జాగ్రత్తపడాలి.



మంత్రిగారు సభకు రాలేదుగాని వచ్చినట్లైతే, ఆయన రానందుకు మనం తిట్టిన తిట్లన్నీ పరోక్షంగా కాకుండ స్వయంగా వినవలసొచ్చేది."

---

"పరిస్థితులు ఎటువంటి విచిత్రమైన నైతికబాధ్యతలను తెచ్చిపెడతయ్యో! మనం ఇప్పుడు మన భూమిపైనఉండే మానవజాతియొక్క అత్యుత్తమ సంస్కృతికి ప్రతినిధులం. ఆ సంస్కృతికి అన్యాయంజరిగే ఒక్కమాట అనటానికిలేదు, ఒక్కపని చెయ్యటానికిలేదు. ప్రమాదవశాన మనం ఇక్కడివాణ్ణి ఒకణ్ణి కాలికింద తొక్కామో అది మన మానవజాతికి శాశ్వతకళంకంగా ఉండిపోతుంది!" అన్నాడు లేర్తో.

కురాజో ఈ విషయం అంతముఖ్యమని భావించలేదుగాని, తన మిత్రుడి సెంటిమెంటు అర్థంచేసుకోగలిగాడు.

అధ్యక్షుడు మోజీ "విశ్వయాత్రికుల" గౌరవార్థం విందు ఏర్పాటుచేశాడు.

"మా వెంట ఆహారం ఉన్నది. మీలో కొన్నివందలమందికి సరిపడే ఆహారాన్ని మామీద వ్యర్థం చెయ్యకండి", అని లేర్తో చెప్పిచూచాడు. కాని మోజీ ఒప్పుకోలేదు.

ఈ విందులో తన్నా అనే శాస్త్రజ్ఞుడు లేర్తోకూ, కురాజోకు, మధ్యగా చాలా ఎత్తయినచోట కూచుని వారితో వారిభాషలో కబుర్లు చెప్పాడు. వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాడు.

ఒక ప్రశ్నకు సమాధానంగా తన్నా, "మేము అధికంగా ఉత్పత్తి చేసేది వాయువిద్యుత్తు. పూర్వగోళానికీ పశ్చిమగోళానికీ మధ్య ఎడతెగని మారుతాలు వీస్తూంటాయి. వాటిసహాయంతో విద్యుచ్ఛక్తి పుట్టిస్తాం. కావలిస్తే మేము మా చీకటిప్రాంతాన్ని సూర్యకాంతిని పోలిన కాంతితో నింపగలం!" అన్నాడు.

"అయితే ఈ ప్రాంతాన్ని చీకటిగా ఉంచుకున్నా రెందుకూ?"

"చీకటి కళ్ళద్దాలు కనిపెట్టినాక మాకు విద్యుత్కాంతి అనవసరమయింది. అదీగాక కాంతిని హెచ్చుగా వినియోగించినవారికి నేత్రవ్యాధులు వచ్చాయి. మేము అనాదిగా చీకటికి అలవాటైపోయినవాళ్ళం చూడండి!" అన్నాడు తన్నా.

వెంటనే కురాజో తన జేబులోనుంచి తన చీకటి సులోచనాలుతీసి తన్నాకు చూపించి, "ఇలాటివేనా మీవికూడా?" అని అడిగాడు. అతను తన అద్దాలను చీకటి వేపు పట్టుకుంటే తన్నా ఒక అద్దంలోనుంచి చూసి తల అడ్డంగాతిప్పి "మీకోసం అద్దాలు తయారుచేయిస్తున్నాం, వచ్చేస్తాయి. తేడా మీరే చూస్తారు", అన్నాడు.

"సూర్యకాంతి లేదుగదా మీ ప్రాంతం చలికి బిగుసుకుపోకుండా ఎలా ఉంచుతున్నారు?" అని లేర్తో అడిగాడు.

"భూగర్భ జలప్రవాహాలు మా గోళం అన్నిప్రాంతాలనూ వెచ్చగా ఉంచుతై. మాకు చలిసమస్య లేదు."

"అన్నట్టు, మీ ప్రపంచంలో సముద్రాలూ, నదులూ కనిపించలేదు. నీటిసంగతి అడుగుదామనుకుంటున్నాను", అన్నాడు లేర్తో.

"నేల అడుగున రాతిపొరలో అంతులేని నెర్రెలున్నాయి. వీటిమధ్యగా అన్తమానం నీరు తిరుగుతూ ఉంటుంది. మారుతాలలాగే ఈ జలప్రవాహంకూడా ఎన్నడూ ఆగదు".

ఈ గోళంలో ఋతువులు లేవనికూడా తెలిసింది. గోళమధ్యరేఖవద్దా, ధృవాలలోనూ ఇంచుమించు ఒకేరకం శీతోష్ణస్థితి ఉంటుంది.

"ఒకప్పుడు మీ ప్రపంచంలోకూడా ఇలాగే ఉండేదని నేను ఊహిస్తున్నాను, సంక్షోభాల అనంతరం సౌరకూటంలో చాలా మార్పులు జరిగినై మరి," అన్నాడు తన్నా.

"సంక్షోభమా? ఏమిటది?" అని లేర్తా అడిగాడు.

"ఆదిత్యగ్రహం విచ్ఛిత్తికావటం. ఆదెబ్బతో గ్రహాలన్నిటి గతులూ తప్పినై. వాటి కక్షలు మారినై. ఇరుసులు వరిగినై. దానికి ఉపగ్రహంగా ఉండిన కుజగ్రహం సూర్యుడికి గ్రహమై కూచుంది. అది కొన్ని శకలాలను తనకు ఉపగ్రహాలు చేసు కున్నదికూడా. మరికొన్ని శకలాలను గురుగ్రహం ఆకర్షించి తన చుట్టూ తిప్పు కుంటున్నది. ఈ నాటి మా ప్రపంచం ఆదిత్యగ్రహ శకలాలలో ఒకటి."

"ఇదంతా కల్పనా, భావనా, పరిశోధనా? ఎందుకడుగుతున్నానంటే అల్పగ్రహ కూటం గ్రహచ్ఛిత్తివల్ల ఏర్పడిందని మా శాస్త్రవేత్తలుకూడా ఊహించారుగాని, మిగిలిన వివరాలు ఏవీ మాకు తెలియదు," అన్నాడు లేర్తా.

"నేనుచెప్పిన విషయాలు ఒకప్పుడు కేవలం ఇతిహాసాధారంగలవి. ఆ ఇతి హాసానికి సంబంధించిన కొన్నివిషయాలను పరిశోధనలు బలపరిచినై. అందుచేత మిగిలినవికూడా వాస్తవమే అయిఉండాలి– కనీసం అయి ఉండవచ్చు."

"మీరు చెప్పేగ్రహం విచ్ఛిత్తి కావటానికి కారణం?"

"గురుగ్రహ ప్రభావమని; ఇతిహాసం అలా సూచిస్తున్నది."

లేర్తా ఈ విషయాలను తాపీగా జీర్ణించుకున్నాడు. "మరొక్క సంగతి చెప్పండి. ఈ గ్రహ శకలంమీదికి మీరంతా ఎలావచ్చారు.? ఆ సంక్షోభంతో ఆ గ్రహంమీద ప్రాణి అన్నది లేకుండాపోయి ఉండాలే?" అన్నా డతను.

దాన్నిగురించికూడా మా ఇతిహాసాలలో ఒకగాథ ఉన్నది. దాన్ని మనం మామూలు భాషలో వివరిస్తే తేలేదేమిటంటే– ఆదిత్య లోకవాసులు మహా మేధావులు. సంక్షోభానికి ముందుగానే వారు సమస్త లోకాలకూ ప్రాణులను సృష్టించి పంపారు. 'సమస్తలోకాలూ మా విహారభూములు' అని వారు చెప్పుకునే వారట. తమ ప్రపంచానికి కలగనున్న సంక్షోభాన్ని వారు ముందుగానే అంచనాకట్టి తమలోకాన్ని ఖాళీచేసి వేరువేరు లోకాలకు కలసి వెళ్లారనీ కొందరు సూర్యుడికేసి వెళ్లారనీ, మరికొందరు సూర్యుడికి దూరంగావెళ్లారనీ తెలుస్తుంది. సౌరకూటంలో ఎక్కడ మనలాటివాళ్ళు కనిపించినా వింతలేదు. ఆదిత్యలోకంవాళ్ళు హెచ్చుగా కుజగ్రహాన్ని చాలాకాలం ఆశ్రయించి ఉండేవారని నా ఊహ. అంతకంటె దూరం వెళ్ళినవారు హెచ్చుగా మారారు. కుజగ్రహం నివాసయోగ్యం కాకుండా పోతున్న కొద్దీ వారు కొత్త లోకాలను వెతుక్కుంటూ బయలుదేరారనీ, మా పూర్వీకులు ఆ విధంగానే ఇక్కడవచ్చి పడ్డారనీ మా శాస్త్రవేత్తల నమ్మకం"

లేర్తొ కురాజో కేసిచూశాడు. ఇద్దరి మొహాలలోనూ ఆశ్చర్యం తాండవిస్తున్నది. లేర్తొ తన్నా కేసితిరిగి, "మీరు చెప్పేది యుక్తియుక్తంగా ఉన్నప్పటికీ పరిణామ వాదాన్ని ఖండిస్తున్నది. పిపీలక లగాయతు మానవుడిదాకా అవిచ్ఛిన్నంగా పరిణామం దశలవారీగా జరిగిందని మా నమ్మకం. మానవుడు ప్రత్యేక సృష్టి అని ఒకప్పుడు మాలోకొందరు శాస్త్రవేత్తలు వాదిస్తూ ఉండేవారు. వారు సాంఘికంగా అభివృద్ధి నిరోధకుల పాత్ర నిర్వహించారు. అంచేత–" అంటూ ఆగి, మానసికంగా నాలుక కొరుక్కున్నాడు.

ఈ మాటకు తన్నా ఆగ్రహించినట్టు కానబడలేదు.

"పరిణామ వాదాన్ని మేమూ ఒప్పుకుంటాం. మానవుడు ప్రత్యేక సృష్టికాదు. కాని ఆదిత్య గ్రహవాసులు కొన్నిరకాల ప్రాణిపరిణామాలను కృత్రిమంగా సాధించారు. అలాటి ప్రాణులు వేరువేరు లోకాలలో ఏవిధంగా పరిణమించేదీ చూడటానికి వాటిని పంపారుకూడా. ఇది నా నమ్మకం మాత్రమే. మా లోకంలో పరిణామం అవిచ్ఛిన్నంగా జరగలేదని మేము స్పష్టంగా రుజువుచేశాం. మా ప్రపంచంలో ప్రాణి జాతులమధ్య ఖాళీ భాగాలున్నాయి. అవి పూడాలంటే ఇతర లోకాలలో అన్వేషించాలిసిందే."

అకస్మాత్తుగా కురాజో కలిగించుకుని, "సిమ్యురో, మా శాస్త్రజ్ఞులు చిత్తశుద్ధి గలవారైతే మీరన్నమాటే అంటారని నాకు నమ్మకం కలుగుతున్నది. మా పరిణామ శాస్త్రంలో కొరుకుడుపడని అంశాలు లేకపోలేదు." అన్నాడు.

భోజనాలు పూర్తి అయే సమయానికి చీకటి అద్దాలు రెండు వచ్చాయి. అవి తొమ్మిదంగుళాల చదరం ప్రమాణంలో ఉన్న గాజు పలకలు. వాటిని తలలకు తగిలించుకునేటుందుకు రబ్బరు లాటి పదార్థంతో తాళ్లు అమర్చారు.

లేర్తొ, కురాజో వాటిని తగిలించుకుంటూనే తలలు పైకెత్తి చూశారు. అప్పటి వరకు నిమ్మ చెక్కలాగా కనిపిస్తున్న భూమి ఈ చీకటి అద్దాలతో సహా పూర్తిగా కనిపించింది. సూర్యకాంతి పడని భూ భాగం ఈ అద్దాలలోనుంచి చూస్తే లేత ఆకుపచ్చ రంగులో కనిపించింది. వాళ్లు వెనక్కు తిరిగి చీకటిలోకి చూశారు. వారికి సమస్తమూ కనిపిస్తున్నది. అంతటా ఆకుపచ్చ రంగే, ఒక చోట ముదురు గానూ, మరొక చోట లేతగానూ కనిపిస్తున్నది.

కురాజో అకస్మాత్తుగా అధ్యక్షుడు మోజీకేసి తిరిగి, "మోజీ, నాకు ఒక్క సందేహం—మీరు సాధించిన సాంఘిక పరిణామం అద్భుతమైన దనటానికి




"ఏమండోయ్ నిద్ర !........ మా చెల్లి మీ యజ్ఞోపవీతం పరమం పవిత్రం చేసిందండోయ్ !"

సందేహంలేదు. కాని మీరు ఈ అభ్యుదయాన్ని మీరే ఉంచుకోవటం ఏమీ బాగా లేదు. మీ ప్రపంచంలో సగం వెలుగులో ఉండి కూడా అజ్ఞానాంధకారంలో ఉన్న దని చెబుతున్నారు. వాళ్ల కొలుములు ఆర్పేసి వారు కూడా అభ్యుదయం పొంద టానికి ఎందుకు తోడ్పడరు ? శక్తి చాలకనా ?'' అని అడిగాడు.

అధ్యక్షుడు నవ్వినట్టు కనిపించింది. ఆయన తల ఎత్తి, ''మీ అరిచేతిలో నన్ను పెట్టుకుని కాస్సేపు నన్ను చాలా ఎత్తున ఉంచగలరు. అంత మాత్రాన నేను మీ ఎత్తుమనిషి లాగా జీవించగలనా ? జీవితం పునాది నుంచి పైకి నిర్మాణం కావాలన్న విషయం నేను మీకు జ్ఞాపకం చెయ్యాలా ?'' అన్నాడు.

''అందుకైనా మీరు సహాయపడవచ్చు గదా ? విప్లవం వాళ్లే చేసుకుంటారు. కాని మీరు వారికి సత్యం చెప్పవచ్చుగద ?" అన్నాడు కురాజో. అతని ఆవేశం చూస్తే ఆ క్షణమే బయేలుదేరి వెళ్లి, ప్రజాపీడకులను నేలబెట్టి కాలరాచి, అక్కడి ప్రజలతో, ''ఇక మీరు కూడా మీ జీవితాలను పునాదుల నుంచీ ఎగకట్టుకోండి !" అనాలట్టున్నది.

"దానికి చాలా అవాంతరాలున్నై. మొదటి సంగతి ఆ వెలుతురు వాళ్లు మమ్మల్ని తమ జాతి వారి కింద చూడరు. మేము జంతువులలో కాస్త మంచి రకం పశువుల మని వాళ్లు శాస్త్ర గ్రంథాలలో రాశారు. అంతా ఒకటే జాతి అని రుజువు చెయ్య టానికి ప్రయత్నించిన శాస్త్ర వేత్తను దేశద్రోహి అని కొలిమిలో వేసేశారు. తాను

చేసిన దేశద్రోహం ఏమిటో తెలియకుండానే ఆ అమాయకుడు బొగ్గయిపోయాడు. అక్కడ జాతి భేదాలు లేవనికాదు. అక్కడి వాళ్ల రికార్డులలో పదహారు జాతులుగా విభజించబడ్డారు. జాతి సాంకర్యం జరుగుతూనే ఉంది. అయినా ఈ పదహారు సంఖ్యను వాళ్లు భద్రంగా కాపాడుతున్నారు. వీటికి అనుగుణంగా పదహారు రకాల రాబడీ. పదహారు రకాల సాంఘిక హక్కులూ, పదహారు రకాల రాజకీయ హక్కులూ అమలులో ఉన్నై. పదహారో రకం వాళ్లు అందరికన్న అధములు. వాళ్ళ దగ్గిర ఏ విధమైనా డబ్బు కనిపించినా కొలిమిలో వేస్తారు. వాళ్ళ దగ్గిర ఉన్న ప్రతి వస్తువుకూ రసీదుండాలి. రసీదులు పారేసుకున్న వాళ్ళ పాట్లు భగవంతుడి కెరుక !

"చెప్పవచ్చిందేమిటంటే, ఆ పదహారో తరగతి వాళ్ళు కూడా తమకన్న హీనులం మేమున్నామని తృప్తి చెందుతారు. అక్కడి వాళ్ళు వాళ్ళని, 'చీకట్లోకి పంపాలా ఏంరా ?' అంటే వాళ్ళు వణికి పోతారు. వాళ్ళు మా ప్రాంతానికి రాకుండా చూడటానికి కొన్ని లక్షల మంది రక్షక భటులున్న సంగతి కూడా వాళ్ళకు తెలీదు. ప్రచారం చాలా విచిత్రమైనది. చెప్పవలసినట్టు చెబితే మనం ఏ అబద్ధానన్నా నమ్ముతాం గద ! అటువంటి సాంఘిక రాజకీయ ప్రచారాలకు అతీతమైన సాంఘిక వ్యవస్థను నిర్మించుకున్నందుకు కూడా మేము గర్వపడుతున్నాం.

"అసలు సంగతి అదే ! ఆ ప్రాంతంలో మమ్మల్ని గురించి జరిగే దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. మా ఆయుః ప్రమాణం చాలా తక్కువనీ, మేము ఒకరినొకరు పీక్కుతింటామనీ, మాకు ఆహారం లేదనీ. ఇక్కడ నిరంకుశత్వం స్వేచ్ఛావిహారం చేస్తున్నదనీ, ప్రతి ఒకరినీ కొరడాలతో కొట్టి పరిశ్రమలు నడుపుతున్నామనీ, ఇక్కడ పరిశ్రమలే లేవనీ, జనం నిరుద్యోగంతో కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, రోజూ లక్షలాది 'పశువులు' పారిపోయి వెలుగులోకి వెళ్ళి ఇక్కడి పరిస్థితులను గురించి మొరపెట్టుకుంటున్నారనీ—తమ కాళ్ళకు తామే బందాలు వేసుకుంటూ విషప్రచారం చేస్తున్నారు.

"ఈ ప్రచారాన్ని అరికట్టే ఉద్దేశంతో మొదట్లో మేము కరపత్రాలు పంపాము. కాని అవి ఎవరి దగ్గిర దొరికితే వారినల్లా కొలుముల్లో వేసేశారు. ఆ దుర్మార్గం చూడలేక మేము ప్రయత్నాలు మానేశాం. ఇప్పుడు మా రెండు ప్రపంచాల మధ్యా పెద్ద అఖాతం ఉన్నదని చెప్పాలి. అయినా అక్కడి వార్తలను మేము ఎప్పటి కప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాం. ఎలాగని అడగవద్దు.... నేను మనవి చేసేదల్లా

ఏమిటంటే. అక్కడి ప్రజలు మా జీవితం గురించి తెలుసుకుని విప్లవోన్ముఖులు అవుతారనుకునే పిన్న వారి జీవితం మీద రోత పుట్టి. అందులోని అవాస్తవలక్షణాలూ, వైరుధ్యాలూ తెలిసివచ్చి విప్లవం సాగిస్తారనుకోవటం ఎక్కువ సబబుగా ఉంటుందేమో."

"నేను మీతో ఏకీభవించలేకుండా ఉన్నాను " అన్నాడు కురాజో "ప్రచారం తప్పక సహాయ పడుతుంది. మా ప్రపంచంలో అన్నిదేశాలవారూ ఇతరదేశాలను చూసి, మనంకూడా ఇంతబాగానూ బతకవచ్చునుగదా అనుకుని కృషిచెయ్యటం జరిగింది. "

"ఇక్కడి పరిస్థితులు వేరనుకోవాలి," అన్నాడు అధ్యక్షుడు నమ్రంగా. "మా జీవితంగురించి ఉన్నవిషయాలే చెప్పినా అవి అక్కడివాళ్ళకు అభూత కల్పనలు అనిపించే అవకాశం ఉంది. అవి నమ్మి, అర్థంచేసుకుని, అందరూ ఏకమై, కొంతకాలంపాటు రహస్యయత్నాలుచేసి విప్లవంచేసేదాకా రావటం దురూహ్యంగా ఉన్నది. "

కురాజో ఏదో అనబోతుండగా లేర్తొ అతన్ని వారించాడు. అతను పైకేమీ అనక దీర్ఘాలోచనలో ఉన్నట్టు కనబడ్డాడు.

## 6

ఒక చిన్నపోలీసుస్టేషను లాటిది. లోపల ఒక అధికారి కూచున్నాడు. బయట ఇద్దరు జవాన్లు దబ్బనాలంత ఈటెలు నేలపై ఆనించిపెట్టుకుని నిలబడ్డారు.

ఒకగుంపు స్టేషనుకేసివస్తూ కనిపిస్తున్నది. జవాన్లు అధికారితో చెప్పారు. అధికారి బయటికివచ్చి కాళ్ళు ఎడంగాపెట్టి, చేతులు వెనక్కుపెట్టుకుని నిలబడ్డాడు. అనుభవంగల ఆయనకు ఆగుంపులో ఇద్దరు ముఖ్యులు కనబడ్డారు— ఒక మగవాడూ, కుంటుతూ నడుస్తున్న ఒక ఆడదీ.

గుంపుకచేరీ బయట ఆగింది. ఆడదానివెంట ఉన్న మగవాణ్ణి ఎవరో ముందుకు నెట్టారు.


"ఏవర్రా నువ్వు ? " అని అడిగాడు అధికారి.

"బానిసోణ్ణి ! నాపేరు మన్నా అండి, దేవుడుగారూ ! "

"ఇదెవ్వతె ? "

"నా దాసీది. పల్లీ. "

"కుంటుతుందేం?"
"కాళ్ళిరగ్గొట్టాను."
"ఓహో!....ఏం?"
"ఆరాచ్చసుకి చేతుల్లో కులుకుతా కూకుండది."
"ప్యానాలుపోయి సస్తాఉంటే కులకుటమేందీ, పాడు?" అన్నదిపల్లి.
"అసలాడు నిన్నుతాకాడాలేదా?" అన్నాడు మన్నా.
"తాకివొదిలాడు. నయంగాదా? ఆ గుప్పిలి అట్టనేముడిస్తే కిసుక్కు-మనాల్సిందే గాదా! ప్యానాలతో బయటపడ్డానే!" అన్నది.
"నేనైనా నిన్ను కాల్లమీద గొట్టాగాని గొంతు పిసికెయ్యలేదుగా!" అన్నాడు మన్నా.
"ఏయ్! నోర్ముయ్యండి!.... రాక్షసుడెవఁడ్రా?"
"ఇద్దరు రాచ్చసులు, దేవుడుగారూ! ఒకడైతే అంత అనుకోల్సిన పనేందీ? ఇద్దరూ!" అన్నాడు మన్నా, తనకీర్తి ఈ దెబ్బతో రెట్టింపవుతుందన్న దృఢ విశ్వాసంతో.
"అతి వాగుడు కట్టిపెట్టి అడిగేదానికి సూటిగా సమాధానం చెప్పకపోతే కొలిమిలో వేయించగల్ను. తొత్తుకొడకా! చెప్పు, వాళ్ళు రాక్షసులని నీకెలాతెలుసు? అబద్ధం ఆడావో బుర్ర ఎగిరిపోతుంది," అని అధికారి గద్దించాడు. అప్పుడే ఆయనదృష్టిలో మన్నా సగం ముద్దాయి అయిపోయాడు.
అయితే మన్నా బెదరలేదు. వాడు తెచ్చేది ఎంత అపూర్వమైన వార్తో వాడికి తెలుసు.
"ఎట్టా తెలిసేదేందీ? మడుసులు ఆకాశం వెత్తుంటేనూ! ఈడ ఓకాలేస్తే మల్లీ రెండోకాలు అల్ల ఆసెట్టుదగ్గరే! నన్నా రాచ్చసుడు అరిసేతిలో కెక్కించు కుంటే ఆ అరిసెయ్యి ఈ గదంతుండె! ఆల్లు నోరుతెరిస్తే కొండరాయంతేసి పల్లు.
అధికారి క్షణంసేపు నిర్ఘాంతపోయి అంతలోనే మండిపడుతూ పళ్ళుపటపటా కొరికి. "నాకు కట్టుకథలు చెబుతావుట్రా తొత్తుకొడకా!" అంటూ మన్నాను ఏదో చెయ్యబోయాడు. గుంపులోనుంచి ఆర్తనాదాలు బయల్దేరినై...."ఆడు సెప్పేది నిజమే. దేవుడుగారూ....ఆ రాచ్చసులను మేఁవంతా సూశాంలెగండి!.... అనుమంటి రాచ్చసుల్నించి తమరు మమ్మల్ని కాపాడతారనేగదా మేం తమరి దగ్గరికొచ్చాం!...."



"శ్రీనాథుడి పేరు చెప్పితే పచ్చి శృంగారం ఒలుకుతుందని వేరే చెప్పక్కర్లేదు............
దీనారటంకాల తీర్థమాడించి ఊరేగించినది దీనిమీదే! మన 'కవి సార్వభౌమ' చిత్రంలో
వెండితెరమీద కనిపించబోతూన్న బ్రహ్మాండమైన పల్లకి!"
"అదంతా సరేగాని, ఆ 'కత్తెర్ల'కి కళ్లుండవుగా!........"

---

ఇంతలో మారూలెక్కి ఒక జవాన్లదళం వచ్చి కచేరీబయట దిగింది. (మన లోకంలో మనుషులు గుర్రాలెక్కి తిరిగినట్టే ఆ లోకంలోవాళ్ళు మారూలనే మచ్చిక జంతువులనెక్కి సవారీచేస్తారు. ఈ జంతువులు చిన్న పిల్లికూనలంత ఉంటాయి!)

జవాన్ల నాయకుడు అధికారితో తాము వచ్చినపని పాఠం వప్పగించేవాడల్లె చదివాడు:

"ఆరోహోదా అధికారిగారు విమానంగురించి దర్యాప్తు చెయ్యటానికి తమకు తోడ్పడమని మమ్మల్ని పంపారు. విమానం ఈ ప్రాంతంనుంచే రావటం నూట ఇరవై ఎనిమిదిమంది తమకళ్ళతో చూశారట."

"విమానం? విమానమేమిటి?" అంటూ అధికారి అయోమయంగా మన్నా కేసిచూశాడు."

"సెప్పండి, మావైగారూ! ఆ రాచ్చసులు దిగింది యిమానంలోనేగా! అది దభాల్న కిందపడేసరికి బూఁవంతా దద్దరిల్లిపాయెనే!" అన్నది పల్లీ తనభర్తతో.

"ఇది చెప్పేమాట నిజఁవా?" అన్నాడు అధికారి మన్నాతో.

"నన్ను సెప్పనిస్తే ఆమాట సెబుదామనేగదండీ నేనొచ్చిందీ?" అన్నాడు మన్నా.

"ఆ విమానం ఎక్కడుందో దారిచూపించూ!" అంటూ అధికారి ప్రయాణ సన్నాహాలు చేశాడు.

"అది యాడుండది. దేవుడయ్యగోరూ?" అన్నాడు మన్నా కాస్త చనువు తీసుకుంటూ. "అల్లిద్దరు రాచ్చసులూ మళ్ళి యిమానంలోఎక్కి అట్టనే యెల్లిపోయారుగా!"....

ఆవిధంగా దర్యాప్తు ప్రారంభమయింది. ఎనిమిదోహోదాగల ఆ అధికారి మన్నానూ కుంటుతూ పల్లినీ.... అది ఎక్కడ దిగబడిపోతే ఎవరితో అత్యాచారం చేస్తుందోనని మన్నా దాన్ని చచ్చినట్టు తనవెంటనే నడిపించాడు!....గుంపును వెంటబెట్టుకుని విమానం దిగినచోటికి వెళ్ళి విమానంజాడలు చూశాడు. అది దిగినచోట రెండేసి నిలువుల గుంటలు కనిపించినై. (నిలువంటే అక్కడిమనుషులనిలువు – సుమారు అయిదున్నర అంగుళాలు.)

ఆరోహోదాగల అధికారికి ఆయన రిపోర్టు ఈ విధంగా పంపాడు;

"ఒక విమానం ఎటునుంచోవచ్చి దిగినమాట నిజమే. దాన్ని చూసినవారిని వెయ్యిమందిని నేను స్వయంగా ప్రశ్నించాను. దురదృష్టవశాత్తూ అది ఎటునుంచి వచ్చినదీ గమనించినవారు లేరు. ఆకాశంనుంచి దిగిందని ఒక ఆడసాక్షి చెప్పే మాట నమ్మదగి ఉన్నది. ఎందుకంటే నేనుచేసిన పరిశోధనల ఫలితంగా ఆ విమానం వ్యాసం అధమం నూరు నిలువులనీ. దాని ఎత్తు ఇరవై నిలువులకు పైబడి ఉంటుందనీ తేలింది. మన దేవమందిరం అంతకన్న ఆటేపెద్దది కాదు గనక అటువంటివస్తువు ఆకాశంనుంచే వచ్చిందనుకోక తప్పదు. (దేవమందిరం అంటే కేంద్ర రాజభవనం.) ఆ విమానంలోనుంచి ఇద్దరు అసాధారణ వ్యక్తులు (రాక్షసులు అనేమాట రాసికొట్టేసి ఉంది.) దిగారు. వారిఎత్తు ఇరవై నిలువులుంటుంది. వారు వంగకుండానే విమానంలోనుంచి బయటికిరాగా చూసినవారున్నారు. అందుచేత విమానం ఎత్తు ఇరవై నిలువులకు పైబడిఉంటుందని నేను హేతువాదరీత్యా ఊహించాను. ఆ దిగిన వ్యక్తులు స్త్రీలో పురుషులో తెలియరావటంలేదు. ఒకరు స్త్రీ, మరొకరు పురుషుడూ అయి ఉంటారని నా నమ్మకం. వారివెంట వారిసంతానంకూడా ఉండినపక్షంలో వారు విమానంలోనే ఉండిపోయారు. ఈ రాక్షసులు మన పౌరులను బెదిరించటానికీ, వారిద్వారా ఏవో రహస్యాలు రాబట్టటానికీ ప్రయత్నించినట్టు ప్రబలమైన సాక్ష్యం ఉన్నది. ఇంతలో

కొందరు 1133 స్టేషను కేసి బయలుదేరటం చూసి ఆ వ్యక్తులు తమ విమానంలో ఎక్కి చీకటిప్రాంతంవేపు పరారీ అయిపోయారు. ఈ సందర్భంలో ఒక్కసంగతి పై అధికార్లకు జ్ఞాపకం చేయ సాహసిస్తున్నాను. నాకింద ఉన్న 1133 స్టేషను ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను దక్షతతో కాపాడుతూ విద్రోహులకు హడలు పుట్టిస్తున్నది. అందుకు ఈ దీర్ఘకాయులు పరారీ అయిపోవటమే ప్రబల నిదర్శనము. మరొక సూచనచేయటానికి కూడా నేను సాహసిస్తున్నాను. 'చీకటి పశువుల' తరపున ఈ అసాధారణవ్యక్తులు లోకాంతరంనుంచి వచ్చి ఉంటారని నాకు అనుమానంగా ఉన్నది. ఆ పశువులకు లోకాంతర వాసుల అండఉన్నదన్న సంగతి పొక్కటం శాంతిభద్రతలకు అంతమంచిదికాదు. ఈ విమానం గురించిన దర్యాప్తు ఎంత రహస్యంగా జరిపితే అంతమంచిది. విమానం ఏమీలేదనీ. ఎవరో భ్రమపడ్డారనీ పత్రికలలో అధికారప్రకటన జరగటం మంచిదని నేను భావిస్తూ, సరిఅయిన నిర్ణయం సర్వజ్ఞులైన పెద్దలకు వదులుతున్నాను."

## 7

1133 పంపిన రిపోర్టు ఎంత ప్రముఖంగా పరిగణించ బడిందంటే పై అధికారులు క్షణాలమీద ఆ రిపోర్టుపంపిన అధికారి హోదాపెంచటమే గాక, కొద్ది క్షణాలలోనే దేవమందిరంలో అగ్రనాయకుల రహస్య సమావేశం జరిగి రిపోర్టు మీద చర్చకూడా సాగింది. రిపోర్టు వివరాలను గురించి పల్లెత్తు ఆక్షేపణ రాలేదు. విమానం కబురు శుద్ధాబద్ధమన్నవార్త పత్రికలకు పంపేసూచన వెంటనే అమలు జరిగిందికూడా.

విమానం వార్తలను గురించిన అధికార ప్రకటన ఈ విధంగా ఉన్నది:

"లోకాంతరంనుంచీ ఒక బ్రహ్మాండమైన విమానం మన ప్రపంచంలో వచ్చి వాలిందనీ, అందులోనుంచి ఇద్దరు అతిదీర్ఘకాయులు బయటికివచ్చారనీ, వారుతిరిగి విమానంఎక్కి చీకటిప్రాంతానికి వెళ్ళిపోయారనీ ప్రజలలో పుట్టిన పుకార్లకు ఎలాటి ఆధారమూ లేనట్టు ప్రభుత్వం జరిపిన అచూకీద్వారా రుజువయింది. ప్రజలు ఎలాటి ఆందోళనగాని చెందనవసరంలేదు."

ఈ ప్రకటన ముసాయిదా తయారుచేసిన అవివేకి ఎవడో తెలియదు. అంతకు మునుపే జనంలో రాక్షసులు ఆకాశంనుంచి దిగారన్నవార్త వ్యాపించి ఉన్నది. ఇప్పుడు జనానికి మరికొన్ని వివరాలుకూడా తెలిసినై. అందువల్ల పెద్దనష్టం

జరిగిందనికాదు. సామాన్యప్రజలు రాక్షసులు వచ్చారంటే భయపడేస్థితిలో లేరు. జీవిత మాధుర్యం ఎరగని వారికి ప్రాణభయం ఉండదు. పల్లీగాని, మన్నాగాని, అంతరిక్ష నౌకను చూసిన మిగతా యాభై ఇద్దరుగాని. తాము చూసినది ఇతరులకు చెప్పేటప్పుడు తమ ఆశ్చర్యాన్ని ప్రకటించారుగాని, భయం కొంచెంకూడా ప్రదర్శించలేదు.

ఈ రాక్షసులు చీకటిప్రాంతంకేసి వెళ్ళారన్నవార్తను ఏవిధంగా జీర్ణించికోవాలో ప్రజలకు అర్థంకాలేదు. చీకటి పశువులకు రాక్షసుల అండ ఉన్నదా? ఉంటే వెలుతురు వాళ్ళకు ఏపాటి ప్రమాదం ఉండవచ్చు?

ఈ ప్రశ్నలే రహస్య సమావేశంలో పాల్గొన్నవాళ్ళనుకూడా బాధించినై.

''కీడెంచి మేలెంచాలి! మనం రక్షణకు ప్రత్యేక మొత్తాన్ని, పెద్దమొత్తాన్ని, కేటాయించటం మంచిది!'' అన్నాడు ధాబూ. ఈ ధాబూ రక్షణవ్యయంలో ముప్పాతిక మొత్తం తన సొంతానికి కైంకర్యం చేసుకుంటు అందులో దాదాపు సగం మిగిలిన మంత్రులందరికీ పంచుతున్నాడు. విద్యామంత్రి, వాణిజ్యమంత్రీ గృహాలమంత్రీ, కొలుములు—భద్రతమంత్రీ— అందరూ ఇదేపని చేస్తున్నారు గనక ఒకరినొకరు ఆక్షేపించటానికి లేదు.

"అంటే కొత్తపన్నులు వెయ్యాలి. ఏంకారణం చెబుదాం? విమానం వార్త అబద్ధమని పత్రికలకు అధికారవార్తకూడా పంపితిమే?" అన్నాడు పెద్దదేవుడు నిట్టూర్చి. (ఆయన అధ్యక్షుడులాటివాడు.)

''మళ్ళీ ఇంకో అధికారప్రకటన రేపు పంపుదాం—ఒక చిన్న విమానం దిగిందనీ, అందులో సాయుధులైన చీకటిపశువు లున్నారనీ, వారు రహస్యాలు తెలుసుకోవటానికి వచ్చి తిరిగి వెళ్ళిపోయినట్టు రుజువయిందనీ అందాం", అన్నాడు రక్షణదేవుడు ధాబూ ఆత్రంగా.

"చీకటిగొడ్లకు విమానాలున్నవని మనమే ఒప్పుకుందామా?" అంటూ పెద్ద దేవుడు మళ్ళీ నిట్టూర్చాడు.

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు.

"ఏదీ చెప్పవద్దు కొత్తపన్నులు వేద్దాం. ఆ డబ్బుతో రక్షణసన్నాహాలు సాగిద్దాం", అన్నాడు ఖజానాదేవుడు. ప్రతి కొత్తఖర్చు పద్దునూ ఎందుకో ఆయన బలపరిచేవాడు.



"ఇప్పుడు నే తీస్తున్న చిత్రంలోని హీరోయిన్ తన చిన్నతనంలో మాఇంట్లో పనికత్తెగా ఉండేది!"
"ష్ ః ఇప్పుడు నేను చెప్పినట్టిదల్లా యాక్టు చేస్తున్న మా హీరోయిన్ ఇంట్లో నే బాయిగా ఒకప్పుడు పనిచేసేను.........."

---

"రక్షణ సన్నాహాలు నిజంగా సాగిద్దాం", అన్నాడు మరొకదేవుడు.

"ఎప్పటికైనా మనం ఆ చీకటిభాగాన్ని జనరహితం చెయ్యకపోతే మనకు ప్రమాదం ఉండనేఉన్నది", అన్నాడు ఇంకోదేవుడు.

"ఆ పని అదివరకు అయిదుసార్లు ప్రయత్నించి నెగ్గలేకపోయాం. ఇరవై నిలువులవాళ్లూ, ఈ భవనమంత విమానమూ ఆ ప్రాంతంలో ఉండగా మనం ఈ పనికి పూనుకోగలమా అని।" పెద్దదేవుడు మళ్లీ నిట్టూర్చాడు.

మళ్ళీ కాసేపు అందరూ మౌనముద్ర ధరించారు.

చూసిచూసి రక్షణదేవుడు పగలబడ్డాడు. "ఈ రిపోర్టుచూసి మన మతులుకాస్తా పోయాయి. కొంచెం ఆలోచిస్తే ఇదంతా అబద్ధాలపుట్ట అని తేలిపోతుంది. ఒక వేళ ఏలోకంనుంచో రాక్షసులలాటివాళ్లు విమానంలో వచ్చారే అనుకున్నా, వాళ్లకూ చీకటిపశువులకూ ఏం సంబంధం ఉంటుంది? ఎలా ఉంటుంది? వాళ్ళు లోకాంతరాలవాళ్ళతో మాట్లాడగలరా? ఏ భాషలో మాట్లాడతారు? ఆ భాష వాళ్ళకెలా వచ్చు? వెలుగులో ఉండే మనకే చాతగాని ఈ పనులు ఆ గుడ్డిపశువులకు ఎలా సాధ్యం? కొంచెం తాపీగా ఆలోచిస్తే నే నడిగిన ప్రశ్నలకు సమాధానాలులేవు... కనక రక్షణవ్యయం మంజూరుచేసి చీకటిమీదికి దాడి వెళ్లటం మంచిది."

"ఆ విమానం చీకటికేసి వెళ్ళినట్టు చాలామంది చూశారే, అని ఒకదేవుడు సందేహం వెలిబుచ్చాడు."

"వచ్చిన విమానం ఎటువెళ్ళినా చీకటికేసి వెళ్ళినట్టే అనుకుంటారు జనం. నన్నడిగితే అది ఎలావచ్చిందో అలాగే వెళ్ళిపోయుంటుంది।" అన్నాడు రక్షణ దేవుడు.

"అయితే ఇప్పుడు యుద్ధసన్నాహాలకు పెద్దఅగత్యం ఉండదుగా?" పెద్ద దేవుడు నిట్టూర్చాడు.

"అగత్యం ఈ క్షణాన లేదని నేనూ ఒప్పుకుంటాను. కాని మనం తాత్సారం చెయ్యకుండా వచ్చే బడ్జెటులోనైనా చీకటిప్రాంతం నిర్జనం చెయ్యటానికి తగినంత మొత్తం మంజూరుచేసుకుంటే బాగుంటుంది", అన్నాడు రక్షణదేవుడు.

రహస్యసమావేశం ముగిసింది. దేవుళ్లందరూ తృప్తిపడ్డారు.

తరవాత వారు తాగుడుకు ఉత్తరువిచ్చారు. వయసులో ఉన్న ఆడవాళ్ళు తాగుడు తెచ్చారు. ఆడవాళ్ళూ దేవుళ్ళూ కలిసితాగారు. కామోద్రేకం తెచ్చుకున్నారు. మైథునంగురించిన హాస్యాలు నిస్సంకోచంగా మాట్లాడుకున్నారు. గోప్యం ఏమీలేకుండానే కామోపశాంతికూడా కలిగించుకున్నారు. తరవాత బహుమతులూ, డబ్బూ తీసుకుని ఆడవాళ్లు వెళ్లిపోయారు.

ఇది ఈ ప్రపంచంలో సర్వసామాన్యమైన విషయం. ఇక్కడి ధనికులు శరీర తృష్ణలన్నిటికీ వ్యాపారాలు సృష్టించారు. తిండిసుఖం కావలసినవాడు డబ్బు ఖర్చుచేసి తీరాలి. ఆహారపదార్థాలలో వాడే మసాలాదినుసులూ, వాటిని పండించే హక్కూ గుత్తదార్ల చేతికి వచ్చేసినై. సామాన్యప్రజలు చప్పిడితిండి తినవలసిందే. కొన్నిరకాల కూరలూ, మాంసాలూ, తాగుళ్లూ డబ్బుకుతప్ప దొరకవు. రుచికరమైన భోజనం హోటళ్ళలోనే దొరుకుతుంది.

ఏడాదికి నాలుగు పండగలు, ఎంత పేదవాళ్లుకూడా ఈ పండగలు వచ్చినప్పుడల్లా మంచి భోజనంచేసి జేబులు ఖాళీచేసుకుంటారు. ఏడాదికి నాలుగుసార్లు, నూటికి తొంభై చిల్లర సంఖ్యలో ఉండే దరిద్రుల నిలవ యావత్తూ గుత్తదార్ల చేతికి రూఢిగా వచ్చేస్తుంది. అతిపేదవాళ్లకు కూడా చచ్చురకం హోటల్లో, నిషా రానితాగుడూ ఉన్నాయి. (ఈ నిషారాని తాగుడు గొప్ప నిషా ఇస్తుందని పండగల ముందు పత్రికలలో పేజీ ప్రమాణంలో ప్రకటనలు పడతై. దీన్ని తాగిన అమాయకులు నిజంగా నిషా వచ్చిందనుకుని నంగిగా మాట్లాడటమూ, తూలటమూ మొదలైన పనులు చేస్తారు.)

అట్లాగే మైథునంకూడా గుత్త వ్యాపారులచేతిలో ఉన్నది. కొందరు వ్యాపా

రస్తులు జీతాలిచ్చి స్త్రీలను పెట్టుకుంటారు. ఆ స్త్రీలతో వ్యాపారం చేస్తారు. ఈ సంస్థలలో అత్యుత్కృష్ట సంస్థలు, పేరు మోసినవి ఉన్నై. ఆ సంస్థ ఒకటో నంబరు స్త్రీలను సరఫరాచేస్తుంది. రకంవారిగా ఏడెనిమిది తరగతుల స్త్రీలను అధిక సంఖ్యలో, ఇవ్వగల సంస్థలున్నాయి. పేద ప్రజల కోసం నడిచే సంస్థలు కూడా లేకపోలేదు. ఇవి వయసు చెల్లినవారినీ, రోగిష్టులనూ, కురూపులనూ సరఫరాచేస్తాయి.

ఈ సంస్థలన్నీ పత్రికలకు ప్రకటనలిస్తాయి.


మైథున వ్యాపారం నిర్విఘ్నంగా సాగగలందులకు ఇక్కడి "మేధావులు" తగు ఏర్పాట్లు చేసుకున్నారు. ఏ విధమైన సంపాదనగాని ఉండేవాడు ఒక ఆడదాన్ని పెళ్లాడగోరే పక్షంలో తన సంపాదనలో సగం ప్రభుత్వానికి పన్నుకిందచెల్లించాలి. ఈ కారణంచేత పెళ్లాన్ని పెట్టు కోవటం కంటే డబ్బుపారేసి తమ ఉత్సాహ శక్తులకు అనుగుణమైన ఆడదాన్ని అద్దెకు తెచ్చుకోవటం చాలా చౌకఅని అందరూ గ్రహించారు.

అందరికన్నా హీనులైనవారు మాత్రమే తమ తరగతి స్త్రీలను పెళ్లాడగలరు. ఎందుకంటే ఈ తరగతికి డబ్బురూపంలో జీతాలుండవు. వారికి పన్నులుకూడా లేవు. దేవతలు ఏడాదికి మూడుసార్లు నాలుగుసార్లు ఆర్డినెన్సు జారీ చేసినప్పుడు వాళ్లువెళ్లి ప్రభుత్వం చెయ్యమన్న కూలి చెయ్యాలి. అంతేగాని వారిపైన పన్నుల భారమనేది సుతరాములేదు.

ఈ తరగతిలో కూడ ఆకర్షవంతమైన స్త్రీ ఉంటే వ్యాపారస్తులు ఎగరేసుకు పోతారు. తప్పాతాలూ—పల్లీలాటివాళ్లు—భుక్తికోసం ఒక మొగుణ్ణి కట్టుకుని, వాళ్ల పాదాల కింద అణిగి మణిగి పడిఉంటారు.

ఈ లోకపు కళలు—పద్యాలూ, పాటలూ, నాటకాలూ—సమస్తమూ కామోద్రేకాన్ని ప్రకోపింపజేసేవిగా ఉంటై. "ఆకలి, కామతృష్ణా—ఈ రెండే జీవిత సత్యాలు" అని ఇక్కడి వ్యాపారస్తుల నివాదం.

ఈ కామ ప్రకోపనం మూలంగా మనుషుల మెదడు పుచ్చిపోతున్నదనీ, రాను రాను మేధాశక్తీ, శాస్త్ర పరిజ్ఞానమూ ప్రజలలో క్షీణిస్తున్నాయనీ ఒక శాస్త్రవేత్త హెచ్చరించాడు. ఆయన కాస్తలో కొలిమిని తప్పించుకున్నాడు. ఆయనను న్యాయ స్థానంవారు మందలించి వదిలేశారు. పత్రికలు ఆయనను గట్టిగా మందలించాయి. ఒక ప్రముఖ పత్రిక ఈ విధంగా వ్యాఖ్యానించింది:





"భల్లా గొప్పశాస్త్రవేత్తేనని మేమూ ఒప్పుకుంటాము—వాదన కోసమే అవుగాక! కాని ఆయనకు ప్రజాతంత్ర పరిజ్ఞానం ఏమీ లేదన్నది నిర్వివాదాంశం. మన కళలు ప్రజలకోసం ఉత్పత్తి అవుతూ, ప్రజాదరణే ఆదర్శంగా పెట్టుకుని పురోగమిస్తున్నవి. భల్లా సిద్ధాంతం ప్రజలు తప్పుచేస్తున్నారని! అంటే, వారు మూఢులని! వారి అభిరుచులు భల్లాగారికి నచ్చేలాగా మారితే ఆయన తృప్తిపడతాడు! ఏమి దురహంకారం! ఇలాటి ప్రజాశత్రువులను దేవతలు క్షమించారు! ప్రజాతంత్రాన్ని వ్యతిరేకించే వారిని కొలిమికి కాని, కనీసం చీకటిలోకి గాని పంపటం సమంజసం!

ఈ పత్రిక కోరిక తీరింది. భల్లా చీకటి ప్రాంతానికి వెళ్లి అత్యద్భుతమైన శాస్త్రపరిశోధనలు జరిపి, "ప్రజామిత్రుడు" అనే గౌరవబిరుదు సంపాదించుకొని చిన్నదేవుడికి జరగవలసినంత మర్యాద పొందగలిగాడు.

"భల్లా చీకటిలోకి వెళ్లాడా? ఎలావెళ్లాడు? మన రక్షక సిబ్బంది ఏం చేస్తున్నట్లు? "అని ఈ ప్రముఖ పత్రికే కొన్ని మాసాలపాటు ఆందోళన సాగించింది!

## 8

విమానం గురించి ప్రజలలో బయలుదేరిన పుకార్లు శుద్ధాబద్ధమని ప్రభుత్వం "దేవమందిరం" నుంచి చేసిన ప్రకటనను జనం మరిచిపోయేలోపునే ఆ విమానం మళ్లీ కాంతి ప్రాంతంమీద ఎగిరింది. ఈ సారి పుకార్లకు అవకాశంలేదు—దాన్ని అందరూ ప్రత్యక్షంగా చూశారు. కొందరు మూర్ఛపోయారు. రక్షణదేవుడు



అంటువ్యాధంటారా డాక్టరుగారూ!''

దాన్ని చూసి వణికాడనీ. పెద్దదేవుడు. "నేను మొదటి నుంచీ నమ్ముతూనే ఉన్నాను!'' అని పెద్దగా నిట్టూర్చాడనీ అభిజ్ఞులు చెప్పుకున్నారు.

ఈ సారి విమానం చాలాసేపు ఎగిరింది. లక్షలసంఖ్యలో కరపత్రాలు పడేసింది; ప్రభుభక్తి పరాయణులైన జవాన్లు వాటిని ప్రజల చేతుల్లోంచి లాక్కున్నారు. ఇంతకూ ఆ కరపత్రంలో విద్రోహక విషయం ఏమీలేదు—ప్రజలు బోడికొండవద్దకు వచ్చినట్టయితే దాని నీడలో ఒక అద్భుతమైన ప్రదర్శనం చూపబడుతుంది అని ప్రకటన ఉన్నది.

మళ్లీ ''దేవతలు" సమావేశమై ఈ సంఘటనను గురించి చర్చించారు.

"అయితే విమానాలు నిజంగానే ఉన్నాయన్నమాట! కవుల కల్పన అనుకునే వాణ్ణి. కళ్లారా చూడకపోతే ఇంకా ఆ మాటే అనుకునేవాణ్ణి," అంటూ పెద్దదేవుడు నిట్టూర్చాడు.

రక్షణదేవుకి దవడలు ఇంకా అదురుతూనే ఉన్నై.

"జనం గుంపుగా ఉన్నచోట అది దిగివేస్తే చాలు వెయ్యిమందిచస్తారు. అది అలా ఒక వెయ్యి చోట్ల దిగిలేచిందంటే—భయంకరం! భయంకరం!" అన్నాడాయన.

"ఒక్క—చోట దిగివేస్తే చాలు—" అంటూ పెద్దదేవుడు తలఎత్తి కప్పుకేసి చూసి నిట్టూర్చాడు.

'' ఈ విమానం మనపైన ఇలా ఎగరటం ఎంతమాత్రమూ క్షేమంకాదు.''

"ప్రజలు హడలిపోతారు.''

"దీన్ని మనం వెంటనే నిషేధించాలి."

"ఎలా?"

"ఎలాగేమిటి? మిగిలిన నిషేధాజ్ఞల్లాగే దీన్ని నిషేధిస్తూ ఒక ఉత్తరువు జారీ చేసి పత్రికల్లోనూ, గెజెట్‌లోనూ వేస్తాం. అది మన ప్రపంచాన్ని విడిచిపెట్టి వెళ్ళటానికి కొంత గడువిస్తాము. ఆ తరువాత అది ఇంకా ఇక్కడే ఉంటే తగు చర్యలు తీసుకుంటాం."

"ఏమిటా చర్యలు?"

"ఇప్పుడెలా తెలుస్తుంది? విమానం మన నిషేధాజ్ఞ ఉల్లంఘించినప్పుడు మనం సమావేశమై ఆ చర్యలను నిర్ణయిస్తాం?"

"ఏ చర్యలను?"

అందరూ కాసేపు మౌనం వహించారు. విమానాన్ని చేసేటందుకు ఏమిలేదు! అది దాని చిత్తం వచ్చినంతకాలం ఎగరవచ్చు—చూస్తూ ఊరుకోవాలిసిందే.

"ఆ విమానంలో ఉన్నవాళ్ళు ఇరవై నిలువులుంటే ఆశ్చర్యంఏమీలేదు. వాళ్లతో విరోధం పెట్టుకోవటమా, లేదా అని మనం ఆలోచించాలి," అన్నాడు పెద్దదేవుడు నిట్టూర్పువిడిచి.

"విమానం సంగతి తగలేసిరి. ఈ కరపత్రం మాటేమిటి? విమానాన్ని మనం శాసించలేక పోవచ్చు, మన ప్రజలను తప్పక శాసించగలం, అన్నాడు "వెలపలి" దేవుడు "లోపలి" దేవుడితో.

"అసలు చర్చించవలసిన విషయమేఅది," అన్నాడు "లోపలి" దేవుడు.

"బోడికొండదగ్గరకి జనం వెళ్ళగూడదని నిషేధించాలి."

"వెళితేఏం జరుగుతుంది ?"

"ఆరాక్షసులు— వాళ్ళనింకా మనం చూడలేదనుకోండి— జనాన్ని పోగు చేసుకుని విమానంలో ఎక్కించుకుని చీకటిలోకి వెళ్ళిపోవచ్చు. ఈ విమానం చీకటి ప్రాంతంలో ఉంటున్నదని ఇప్పుడు రుజువయిందిగద!"

"ఎంతమందిని పట్టుకుపోతారు ?"

"ఎంతమందినైనా పట్టుకు పోవచ్చు ఎవరు ఆపగలరు ?"

"మన సాయుధ బలాలను ఉపయోగిస్తే ?"

"సాధ్యమయే పక్షంలో ఉపయోగించవచ్చు."

"ఎందుకు సాధ్యంకాదు ? మనకు లక్షమంది సైనికులున్నారు."

రక్షణదేవుడు చిన్న గుటక వేసి, గొంతు సవరించుకుని, ''లక్షమందినీ సరిహద్దు నుంచి తీసుకురావటం క్షేమంకాదు. పదివేలమంది అయితే— '' అని పూర్తి చేయకుండా ఆగిపోయాడు.

లక్షమందికోసం జీతాలు తీస్తున్నా రక్షణశాఖవారు పదివేలమందికీ జీతాలిస్తున్నారు. అసలు సైనికులు పదివేలమంది సైనలేరు.

''రెండు లక్షలమంది జవాన్లున్నారు.''

ఈసారి "లోపలి'' దేవుడు గుటకవేశాడు. ఆయన ఏమనేవాడో ఎవరూ ఊహించలేరు. ఎందుకంటే ఆయన గొంతువిప్పేలోపల పెద్దభూకంపం వచ్చింది. ధనామని చప్పుడయింది, గోడలూ, బల్లలూ కిటికీలూ అదిరినై.

దేవుళ్ళందరూ ఒక్కసారి ఆసనాలమీదినుంచి లేచారు. వారుకూచున్న పన్నెండో అంతస్తు కిటికీలోంచి ధగధగా మెరుస్తూ ఏదో కనిపించింది. ఒకరిద్దరు దేవుళ్లు కిటికీ దగ్గరికి పరిగెత్తి బయటికి చూశారు. వెంటనే ఒకదేవుడు చాపకట్టలాగా విరుచుకు పడిపోయినాడు. రెండోదేవుడు వెర్రికేకలు పెట్టసాగాడు.

పెద్దదేవుడు నిట్టూర్పులు విడుస్తూ కిటికీని సమీపించి బయటికి చూశాడు.

రాజ్యాంగ మైదానంలో విమానందిగి ఉన్నది. అది దేవమందిరమంత ఎత్తూ ఉన్నది. ఆ విమానంపక్కన ఇద్దరు రాక్షసులు— రాక్షసులు సరిఅయిన మాట కాదు— నిలబడిఉన్నారు. వారు విమానంకంటె కొంచెం తక్కువ ఎత్తున్నారు.

''విప్లవం!'' అన్నాడు పెద్దదేవుడు దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ.

ఒకరాక్షసుడు చేతిలో ఏదోపెట్టె పట్టుకుని ఉన్నాడు. అదేఒక పెద్దరెండతస్తుల మిద్దె ప్రమాణంలో ఉన్నది. ఆ పెట్టెలోంచి చెవులు బద్దలయేటట్టు మాటలు వినుపిస్తున్నై:

ఓ ప్రజాపీడకులైన కాంతి నాయకులారా! మీకోసం విమానం పంపుతున్నాం. ఒక్కరి మా చీకటి ప్రాంతానికి రండి. మీకు అపాయంలేదని నేను—మోజీని— అభయమిస్తున్నాను. మా జీవితం కళ్ళారా చూడండి. మీకు అతిథిమర్యాదలన్నీ జరుపుతాం. మీయిష్టంవచ్చినప్పుడు మిమ్మల్ని మళ్ళీ దిగబెట్టేస్తాం.''

మోజీమాటలు. టేప్ రికార్డుచేసి లౌడ్‌స్పీకరు సహాయంతో వినిపించటంవల్ల రాక్షసిమాటల లాగా దేవుళ్ళకు వినిపించినై.

వారు మళ్ళీ సమావేశమై కర్తవ్యం చర్చించారు.

"ఇది దొంగఎత్తు! మనం వెళ్ల గూడదు.''

మనందరినీ ఒక్కదెబ్బన కొలిమిలో వెయ్యటానికే మోజీ ఈ ఎత్తువేశాడు."

"న్యాయంగా మోజీని తప్పు పట్టగూడదు. వాళ్ళ నాయకు లందరూ మనకు ఒక్కసారిగా దొరికితే మనమైనా వాళ్ళనుకొని — అపనే చేస్తాం."

పెద్దదేవుడు గొంతు సవరించుకుని తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా — ఆయన ఎప్పుడూ అట్లాగే మాట్లాడతాడు — "మనని నిర్మూలించటమే వాళ్ళ ఆశయమైతే ఆహ్వానం దేనికీ? ఆ రాక్షసులు ఆ పని అర క్షణంలో చెయ్యగలరే!" అని నిట్టూర్చాడు.

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు.

"ఈ రాక్షసులను అంతమొందించటానికి ఇది భలే అవకాశం! మనజవాన్లను పిలిపిస్తే?" అన్నాడు రక్షణదేవుడు.

"మామూలుగా భవనానికి రక్షగా ఉండవలసిన జవాన్లూ, సైనికులూ ఎక్కడో దాక్కున్నారు. వాళ్ళకోసం వెతికాను," అన్నాడు పెద్దదేవుడు విచారంగా.

మళ్ళీ కాస్సేపు నిశ్శబ్దం.

"విమానం ఎక్కితే తమషాగానే ఉండవచ్చు." అన్నాడు వెలపలిదేవుడు.

లోపలిదేవుడు కెవ్వన కేకేసి వణకసాగాడు. ఆయనచూపు ఆయనకెదురుగా ఉండే కిటికీకి అతుక్కుపోయింది. అందరూ అటుకేసి చూశారు. ఆ కిటికీకి అడ్డంగా ఒకేఒక కన్నుగుడ్డున్నది!

"ఓ ప్రజాపీడకులైన కాంతి నాయకులారా!...."

మళ్ళీ టేప్ ఆహ్వానం చదవసాగింది.

అది నిలిచిపోగానే పెద్దదేవుడు లేచి నిలబడి, "నాతోఎవరు వస్తున్నారు?" అని అడిగాడు.

మిగిలిన దేవుళ్ళు ఆయనవెనుకనే నడుస్తూ మెట్లు దిగసాగారు.

## 9

"చీకటిపశువుల అమానుషచర్య!", "దేవుళ్ళు ఏమైనారు?", "దేశభక్తుల తక్షణకర్తవ్యం" ఇత్యాది శీర్షికలతో పత్రికలు తమనాయకులను ఎవరో రాక్షసులు ఎత్తుకుపోయిన వార్తలను రకరకాలుగా ప్రకటించినై.

దేవుళ్ళందరికీ పెడరెక్కలు విరిచికట్టారని ఒకవిలేఖరి రాశాడు. ఏదో అదృశ్య శక్తి సహాయంతో నాయకులు విమానంలోకి లాగబడ్డారని మరొకడు రాశాడు.

రాక్షసులు నోళ్ళు తెరవకుండానే మాట్లాడారనీ, అదేదో మంత్రం అయి ఉంటుం దనీ కొందరుపౌరులు అభిప్రాయపడ్డారు.

"గడిచినవే మంచిరోజులు! ప్రపంచానికి విలయం పుట్టేరోజులు వచ్చి పడ్డాయి. భవిష్యత్తు అంధకారమయం!" అంటూ ఒక పత్రిక సంపాదకీయాన్ని ముగించింది.

దేశమంతటా జీవితం స్తంభించిపోయిందనీ, దేవుళ్లందరూ ఒక్కసారిగా నిష్క్రమించటంతో ప్రజలు విచారసాగరంలో మునిగిపోయారనీ కరస్పాండెంట్లు వార్తలు పంపారు.

ఇక ప్రజలలో రకరకాల పుకార్లు బయలుదేరినై....రాక్షసులు చీకటిపశువులకూ మనకూ మధ్య రాజీచెయ్యటానికి వచ్చారుట....వాళ్ళతోమనకు రాజీఏమిటి?....రాజీపడక చస్తామా? వాళ్ళు తలుచుకుంటే ఏమన్నా చెయ్యగలరు—ఆ రాక్షసు లను నువ్వసలు చూశావా?....అవున్లే. వాళ్ళభయంవల్ల గాకపోతే మన దేవుళ్ళు వాళ్లఎత్తు ధనం పోస్తేమాత్రం చీకటిప్రాంతానికి పోతారా?...ఇదుగో, మళ్లీ ఎక్కడా అనమాకు, ఆ చీకటిపశువులు మనకన్న లక్షరెట్లు బాగా బతుకు తున్నారుట! వాళ్లకి మనకుండే స్వేచ్ఛా, హక్కులూ లేవనుకో—మిగిలిన విషయాల్లో మహా సుఖపడిపోతున్నారుట....నేకూడా విన్నానయ్యా! తిండి అమ్మరుట. అందరూ ఊరికే తినొచ్చుట. ఇక్కడిలాగా ఎనిమిదిరకాల భోజ నాలు లేవుట. అందరికీ ఒకటేరకం భోజనమేట. అన్నట్టు షాపుల్లో మనుషులు కాపలా ఉండరట. నీక్కావలిసిన వస్తువులు తీసుకోవటమూ, ఎంతయిందో అంతా గల్లాలో వెయ్యటమూట! నమ్మటానికి లేకుండా ఉంది....పోనిస్తూ. వాళ్ళ గొప్ప నేనూ విన్నాలే. మగవాళ్ళూ, ఆడాళ్ళూ చచ్చినట్టు పెళ్ళిచేసుకోవాలిట. ఆడవాళ్ళు మొగవాళ్లను నువ్వని పిలుస్తారుట. మగవాళ్ళతో సమంగా అన్ని పనులూ చేస్తారుట. అయిందా గొప్పవాళ్ళని దేవుళ్లనికూడా పిలవరుట—పేరు పెట్టి పిలుస్తారుట! తిండయితే తింటున్నారేమోగాని సంస్కారంలేదు నన్నడిగితే....

అనుకున్నట్టైనుకు బోడికొండదగ్గిర, నీడప్రాంతంలో, వేనవేలుగా జనం చేరారు. అప్పటికే అక్కడ లేర్తొ, కురాజోలు ఒకచిన్న థియేటర్ నిర్మించారు. అది వాళ్ల ప్రాణానికి చిన్నదిగాని ఆలోకంలో వాళ్ళప్రాణానికది చాలాపెద్దది. వాళ్ళకు ఒక బ్రహ్మాండమైన, తెల్లనితెర కనిపించింది. (దానిఎత్తు మూడడుగులు, వెడల్పు నాలుగడుగులు.)

ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. అక్కడచేరిన జనం విద్యుచ్ఛక్తి నికూడా ఎరగరు. సినిమాలు అసలేఎరగరు. ఉన్నట్టుండి తెల్లగాఉన్న తెరమీద రంగు రంగులదృశ్యం కనిపించేసరికి హాహాకారాలు బయలుదేరినై. తెరమీద ఉన్న దృశ్యాలు ఉన్నట్టుండి మారిపోతూఉండటం ఇంకా ఆశ్చర్యం కలిగించింది. చెట్లు ఊగుతున్నై. మనుషులునడుస్తున్నై. ఏవో యంత్రాలు (రైళ్లూ, కార్లూ) పరుగెత్తుతున్నై, కాని ఎదటనుంచి పోవటంలేదు. ఒకవిమానం (రాక్షసులు ఉపయోగించే లాటిదికాదు) దూరంనుంచి పరిగెత్తుకుంటూ దగ్గిరికి వచ్చింది. ఆతరవాత ప్రేక్షకులకు తామే దానితోబాటు పరిగెత్తుతున్నామని కాస్సేపు అనిపించింది... ఈ ప్రేక్షకులు మొట్టమొదటిసారిగా సముద్రాన్నీ. అందులో ప్రయాణించే స్టీమర్లనూ, వాటి లోపలిభాగాలనూ చూచారు.


జరిగిందేమంటే అంతరిక్షనౌకలో ఉన్న ఫిల్మ్‌లైబ్రరీలో ఇతరలోక వాసులకు చూపటానికి భూమిగురించిన ఫిల్ములు చాలాఉన్నై. వాటిలో కొన్నిటిని లేర్తా ఏరి ప్రదర్శించాడు.

ఉన్నట్టుండి తెరమళ్ళీ తెల్లగాఅయింది. ఇంటర్వెల్. లేర్తా కావాలనే ఈ విరామం ఏర్పాటుచేశాడు.

ప్రేక్షకులు ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు. వాళ్ళతలలనిండా లక్ష ప్రశ్నలున్నైగాని ఒక్క సమాధానంలేదు. ఆ తెల్లటిదేమిటి? అక్కడ ఏవేవో దృశ్యాలు ఎట్లా వస్తున్నై? వచ్చినవి అంతలో ఎట్లామారిపోతున్నై? అవి ఎక్కణ్ణుంచివచ్చినై, ఎక్కడికిపోయినై? మనం చూసిందంతా చీకటి ప్రాంతంలో ఉందా? వాళ్లేనా ఇదంతా చూపిస్తున్నది. (ప్రేక్షకులకు లేర్తాగాని, మరొకరుగాని కనిపించనేలేదు.) చీకటిప్రాంతంలో వెలుతురెట్లా వచ్చిందీ? లేకపోతే ఇది రాక్షసులుండే ప్రపపంచమా?

అందరికీ అయోమయంగానేఉంది. ఇంతలో తెరమీద ఇంకోరకం దృశ్యం వచ్చింది. ఇది అంతరిక్షయానానికి సంబంధించిన దృశ్యం, అంతరిక్షయానాలలో వివిధదశల దృశ్యాలు వరసగా చూపబడ్డాయి. "భూప్రదక్షిణం" అనే చిత్రము కూడా చూపబడ్డాయి.

మొత్తం మూడుగంటలపాటు ప్రేక్షకులు తాము ఊహించలేని దృశ్యాలు చూశారు. అంతాఅయినాక ఒకగొంతు ఇట్లా చెప్పింది; "మీరిప్పుడు చూసిన విషయాలు మీకర్థమయినాయా? వీటిని చీకటి ప్రాంతీయులు ఏనాడోఎరుగుదురు.



"........నేను బతికున్నంతవరకూ నా గుండె కేం ఢోకా లేదన్నాడు మా డాక్టరు—"

మీరు నిజంగా వారికన్న ఎక్కువ నాగరికత కలవాళ్ళ మనుకుంటున్నారా? ఇళ్ళకు వెళ్లి ఆలోచించుకోండి. ఈసారి మరొక ప్రదర్శనం, ఇంకామంచిది, చూపిస్తాం. ఇక వెళ్లండి."

ఈ లోకంలోవాళ్లు ఇటువంటి ప్రదర్శనం చూడటమే ఒక అపూర్వమైన విషయం. అంతకన్న అపూర్వమైన విషయమేమంటే భద్రతాధికార్లు ప్రజలను యీ ప్రదర్శనం చూడనివ్వటం మామూలు పరిస్థితులలో వాళ్లు జనాన్ని ప్రదర్శనానికి ముందే చెదరగొట్టి ఉండవలసింది. కాని మామూలు పరిస్థితులు ఏనాడో పోయినై. అంతరిక్షనౌక రాక పరిస్థితులను తారుమారుచేసింది. వివిధ తరగతుల మధ్యా, వ్యక్తుల మధ్యా ఉండే తేడాలు ఈ "విమానం" సమక్షంలో తుడిచి పెట్టుకు పోయినట్టయింది. ఇరవై నిలువుల మనుష్యులను కళ్లారా చూసినవాళ్లు తమతమ ఎత్తులమధ్య ఉండే మిల్లిమీటరు వ్యత్యాసాలను మరచిపోవడం సహజమే. ఎంతో గొప్పగా కనిపిస్తూ వచ్చిన ''దేవుళ్లు" కూడా అల్పుల జాబితాలో చేరారు. "రాక్షసులు" పిలవగానే వాళ్లు కిక్కురుమనకుండా విమానంలో ఎక్కివెళ్లిపోయిన క్షణంనుంచీ ఆ రాక్షసులదే సర్వాధికారము అయిపోయినట్టయింది.

ఇది ప్రకృతి నియమాన్ని అనుసరించి జరిగింది. శాసనాలూ, చట్టాలూ సంధి పత్రాలూ ప్రకృతి నియమాల ముందు ఏ పాటి ?

భద్రతాధికారులు జనాన్ని చెదరగొట్టక పోవటమే గాక సామాన్యదుస్తులు ధరించి వచ్చి తాముకూడా ప్రదర్శనాన్ని చూశారు. వాళ్లపై ఆ ప్రదర్శన ప్రభావం వర్ణనాతీతం.

చీకటి ప్రాంతంలో దిగిన దేవుళ్లు కూడా ఒక అపూర్వమైన అనుభవాన్ని చవిచూశారు. విమానంలో నుంచి బయటికి రాకముందే వారందరికి చీకటి అద్దాలు ఇవ్వబడినై. వాటి సహాయంతో వారు సమస్తమూ చూడగలిగారు. అదే వారికి కను విప్పయింది.

ఒక్కముక్కలో చెప్పాలంటే చీకటి ప్రాంతం వాళ్లు అనుకున్నట్టులేదు. అక్కడి జీవితం వారు అనుకున్నదానికన్న లక్షరెట్లు బాగున్నది. వారుచూసిన సవాలక్ష వింతలలో విద్యుద్దీపాలు మొదటివి. రేడియో వారికి అర్థంకాలేదు, కాని ఆశ్చర్యం కలిగించింది.

కొన్నివేలమంది మధ్య వారు జీవితంలో మొదటిసారిగా భోజనం చేశారు. భోజనం దివ్యంగా ఉన్నది. అందరికీ ఒకేరకం భోజనం.

మనుషులులేని దుకాణాలు వాళ్లు కళ్లారా చూశారు–కొనుక్కునేవాళ్లు కొల్లలుగా ఉన్నారు, అమ్మేవాళ్లులేరు.

తాము వీధులవెంట నడుస్తుంటే ఎవరూ తమకు సాష్టాంగ పడకపోవటం వారికి వింతగా కనిపించింది. కాని మోజీ దగ్గరకూడా ఎవరూ సాష్టాంగ పడటం లేదు. మోజీ నోటవచ్చిన ఉత్తరువు మరుక్షణం ఆచరించబడుతుంది. కాని మోజీని చూసి భయపడినవాళ్లు ఒక్కరూ కనిపించలేదు. భయపడకుండా మనుషులు చెప్పినమాట వినటం సాధ్యమా? ఆ అసాధ్యం ఇక్కడ అమలులో ఉన్నది!

ఇళ్లలోనుంచి రేడియోలు పాడుతున్నై, కిటికీలనుంచి పూలతోరణాలు వేళ్లాడుతూ, సువాసనలు వెదజల్లుతున్నై. రోజూ వీళ్ల జీవితం ఇట్లాగే ఉంటుందా? లేక తమను మభ్యపెట్టటానికి ఇవన్నీ ఏర్పాటు చేశారా? తమరాక నిజంగా అంత ముఖ్యమైతే తమనుచూసి తరించటానికి గుంపులు ఎందుకు ఎగబడలేదు.

"ఎక్కడా ఒక్క జవాను లేడు. దీన్ని జయించటానికి పదిమందిచాలు!" అని రక్షణదేవుడు పెద్దదేవుకి చెవిలో రహస్యంగా అన్నాడు. పెద్దదేవుడు మూలిగాడు.

వాళ్లు చీకటి ప్రాంత పరిశ్రమలు చూశారు. అక్కడ ఫౌండ్రీలు, ఫ్యాక్టరీలూ,

మిల్లులూ కార్ఖానాలూ యంత్ర సహాయంతో నడుస్తున్నై. చెమటలు దిగగారుతూ పనిచేసే శ్రామికులు ఎక్కడాలేరు. చెమటపట్టని యంత్రాలు విద్యుచ్ఛక్తితో శ్రమచేస్తున్నై.

పర్యటన ముగిసినాక లేర్తో వారికి సినిమా ప్రదర్శన ఇచ్చాడు. అతను ముందుగా కొన్ని మాటలు వారితో చెప్పాడు. వాటిని మోజీకార్యదర్శి తర్జుమా చేసిచెప్పాడు.

"మా ప్రపంచాన్ని గురించి మీరు కొన్ని విషయాలు చూడబోతున్నారు. మీరు చూడబోయే మనుషులందరూ నా ప్రమాణంగలవారే. ఆ మనుషులను బట్టి మిగిలిన వాటి ప్రమాణాలు మీరే ఊహించుకోండి. మొట్టమొదట మీకు మేము హస్తగతం చేసుకున్న శక్తులను చూపిస్తాను. ఆ శక్తులను మీరు ఊహించగలరేమోగాని పూర్తిగా గ్రహించలేరు. ప్రదర్శనానంతరం మళ్లీ మాట్లాడతాను."

ఈ సినిమా ప్రదర్శనం మరింత విజయవంతంగా సాగింది. ఎందుకంటే చుట్టూ సహజమైన చీకటి. ప్రేక్షకులు చీకటి అద్దాలు తీసేసి సినిమాచూశారు. వారి కది గారడీగా ఉన్నదిగాని వైజ్ఞానిక ప్రదర్శనంగాలేదు. వారుజల విద్యుత్తో, విద్యుచ్ఛక్తితో అతివేగంగా నడిచే రైళ్లూ, యంత్రాలూ చూశారు. రసాయనిక బాంబులు పేలటం చూశారు. మొదటి అణువు బాంబు పేలుడు చూశారు. పరమాణుశక్తితో పనిచేసే బాటరీలూ, జెట్ విమానాలూ, చూశారు.

ప్రదర్శనం అయినాక లేర్తో మళ్లీ చెప్పాడు:

"మీరు అధికార శక్తి చాలా గొప్పదనుకున్నట్టయితే ఆ భావం విడిచిపుచ్చండి. అన్ని శక్తులూ ప్రకృతిలో ఉన్నై. వాటిని స్వాధీన పరుచుకునేది వైజ్ఞానిక శక్తి. ఈ ప్రాంతం వాళ్లు ఒకప్పుడు వైజ్ఞానికంగా మాకన్న వెనకపడి ఉండేవారని విన్నాను. వారు మిమ్మల్ని దాటి చాలా దూరం వెళ్లారు. మీరు మూడునాలుగు తరాలపాటు అవిరామంగా కృషి చేసినా వీరిని చేరుకోలేరు. కొన్ని విషయాలలో వీరివిజ్ఞానం మా విజ్ఞానాన్ని మించిపోయింది.

"మీరు ఆఖరుకు చూసిన అణువు బాంబుల వంటివి ప్రయోగించి ఇటువంటి గ్రహాలను ఎన్నింటినో ధ్వంసం చేసే సాధన సంపత్తి మాకున్నది. కాని ఆ బాంబులను మేము నిషేధించాం. ప్రకృతి ఏకత్వాన్ని సాధిస్తున్నది. సూర్యుడు అనేక గ్రహాలూ, ఉపగ్రహాలూ ఏకమై సౌరకూటం ఏర్పడింది. అలాటి కూటాలు ఎన్నో కలసి పాలవెల్లి ఏర్పడింది. ఈ చిన్న ప్రపంచంలో మీరు ఉప ప్రపంచాలు నిర్మించుకోవటంకంటె అజ్ఞానమవొకటి లేదు.

"మీరు మీ ప్రజలను అజ్ఞానాంధకారంలో ఉంచటానికి నిశ్చయించిన క్షణం నుంచీ మీరుకూడా అజ్ఞానకూపంలో ఇరుక్కుపోయినారు. అది కూడా ప్రకృతి నియమమే. ఈ అజ్ఞానకూపంలోనుంచి అంధకారంలోకి రండి. మీకు వెలపల నుంచి సూర్యకాంతి వస్తున్నదని గర్వించకండి. మీలోపల ఉండే అంధకారాన్ని చూసి సిగ్గుపడండి.

"మీ ప్రజలు మానసికంగా వెనకబడిఉన్నారనీ, వారికి విజ్ఞానం అందదనీ వాదించ గలరు. వీటిలో మంచినమనిషి తడిగా ఉంటాడు. అనేక తరాలుగా అణిచిపెట్టి ఉన్న మీ ప్రజలు ఇవాళ అజ్ఞానంలో ఉండవచ్చు. మీ క్షుద్రమైన ఉక్కుపాదాలు వాళ్ళ జీవితాలపైనుంచి తీసివేసినాక వాళ్లుకూడ మేధావంతులవుతారు. ఘనకార్యాలు చేస్తారు. అందుకు ఇక్కడిప్రజలే నిదర్శనం!"

# 10

అంతరిక్షనౌక తిరిగి శూన్యాకాశంలో నడుస్తున్నది. గ్రహశకలం అంతకంతకూ చిన్నదై పోతున్నది. కురాజో దానికేసిచూడటం మానేసి టెలిస్కోపునుంచి ఇవ తలికి వచ్చి, "మనప్రయత్నాలవల్ల వాళ్లకేమైనా మేలు కలుగుతుందటావా?" అన్నాడు.

"సలహా ఇవ్వటం మటుకే మనవంతు. దాన్ని వినియోగించటం వాళ్ళవంతు.

"నువు పొరపాటు చేశావు. మనం అతిసులభంగా చీకటివాళ్ళపెత్తనం గ్రహ మంతటా నెలకొల్పి ఉందుము."

"అదినిజమైతే మోజీ మనను ఆ పని చెయ్యమని కోరి ఉండడా?"

"మోజీ సర్వజ్ఞుడా? అతనూ పొరపాటే చేశాడు."

లేర్తో ఆశ్చర్యంగా కురాజో కేసి చూశాడు.

"మోజీ నీకన్నా నాకన్నా సమర్థుడు కాడనుకుంటున్నావా? అతను పదిహేను సెంటిమీటర్ల మనిషి అన్నది చూసి అలా అనుకుంటున్నావా? ఆ చీకటిప్రాం తానికి నువూ, నేనూ నాయకత్వం వహించిఉంటే ఆయన సాధించిన విజయాలలో సంగం సాధించి ఉండగలమని నామటుకు నాకు నమ్మకంలేదు!" అన్నాడతను.

కురాజో మొహం చిట్లించుకుని మౌనంగా ఉండిపోయినాడు.

అంతరిక్షనౌక తగినంత వేగం అందుకోగానే లేర్తో రాకెట్ ఇంజన్లను ఆపు చేశాడు. నౌకను నిశ్శబ్దం ఆవరించింది. ★